మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 31-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 182 Issue: 182

Published from Jagitial
www.evarthalu.com

31 డిసెంబర్ 2025 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:49 సూర్యాస్తమయం - సా. 5:48 తిథిః ద్వాదశి రా. 1:46ం వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం కృతిక రా. 1:27ం వరకు తరువాత రోహిణి యోగం సాధ్య రా. 9:04 వరకు కరణం బవ మ. 3:24 వరకు భాలవ రా. 1:46ం వరకు వర్జ్యం మ. 2:44 నుండి సా. 4:10 వరకు దుర్ముహూర్తం ఉ. 11:57 నుండి మ. 12:41 వరకు రాహుకాలం మ. 12:19 నుండి మ. 1:41 వరకు యమగండం ఉ. 8:12 నుండి ఉ. 9:34 వరకు గుళికాకాలం ఉ. 10:56 నుండి మ. 12:19 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:13 నుండి ఉ. 6:01 వరకు అమృత ఘడియలు రా. 11:19 నుండి రా. 12:45 వరకు అభిజిత్ ముహూర్తం లేదుజ గమనిక: "ం" అనగా మరుసటి రోజున

## మరో ఆరుగురు ఐఏఎస్‌లు బదిలీ

హైదరాబాద్, డిసెంబర్ 30 (ఈవార్తలు): కొత్తగా నాలుగు కమిషనరేట్ల ఏర్పాటుతో సోమవారమే సీనియర్ ఐపీఎస్‌ల బదిలీలు చేపట్టిన ప్రభుత్వం ఐఏఎస్‌లను ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆరుగురు ఐఏఎస్‌లకు స్థాన చలనం కల్పించింది. జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా ఇ.సృజన. -2 వ పేజీలో...



## టీ20 సిరీస్ క్వీన్ స్వీప్

**అదరగొట్టిన అమ్మాయిలు**
**శ్రీలంకపై జయకేతనం**
**2025కు ఘన వీడ్కోలు**



# సర్కారు మొద్దునిద్ర

బనకచర్ల ప్రాజెక్టుకు నిసంబంధించి కేంద్ర జల సంఘం నుండి అనుమతులు రావడంపై తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేగుతోంది. దీనిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని, లేదంటే తెలంగాణ జల ప్రయోజనాలు శాశ్వతంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ నుంచి కీలక అనుమతులు రావడం తెలంగాణకు తీవ్ర అన్యాయమని అన్నారు.

**బనకచర్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**
**చంద్రబాబుకు రేవంత్ గురుదక్షిణ**
**కత్తి ఆంధ్రోళ్లది.. పొడిచేది రేవంత్**
**తెలంగాణ అభిప్రాయం తీసుకోకుండానే అనుమతులు**
**మాజీమంత్రి హరీశ్ మండిపాటు**

హైదరాబాద్, డిసెంబర్ 30 (ఈవార్తలు): తెలంగాణ అభిప్రాయం తీసుకోకుండానే కేంద్రం ఈ అనుమతులు ఇవ్వడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వం టెండర్లు పిలుస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం కనీసం కోర్టును ఆశ్రయించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఈ అనుమతులు కనిపించడం లేదా? లేక పడుకున్నట్లు నటిస్తున్నారా? అని ప్రశ్నించారు. 'గోదావరి బనకచర్లతో జల దోపిడీకి ప్రయత్నం చేసిన ఏపీ నష్టాన్ని తగ్గించడం కోసం బనకచర్ల నుంచి నల్లమల సాగర్‌కు మార్చుకుంది. ప్రాజెక్టు ఏదయినా జరిగేది తరువాయి 2 వ పేజీలో...



## పోరాడుతున్నాం

### హరీశ్ రావు అబద్ధం చెప్తున్నారు

**సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ వేశాం... మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

హైదరాబాద్, డిసెంబర్ 30 (ఈవార్తలు): బనకచర్ల ప్రాజెక్టుపై మాజీమంత్రి హరీశ్ చేసిన ఆరోపణలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సాగునీటి అంశంపై హరీశ్ రావు అబద్ధాలు చెబుతున్నారు. 'బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తాము పోరాటం చేస్తూనే ఉన్నాం. సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ సైతం ఇప్పటికే దాఖలు చేశాం. జనవరి 5న పిటిషన్ విచారణకు వస్తుంది' అని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.



## 'క్యూర్' చేద్దాం

**కాలుష్య రహిత హైదరాబాద్ లక్ష్యం**
**ఆ దిశగా పూర్తిస్థాయి ప్రక్షాళన**
**నెలకు 3 రోజులు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్**
**ప్రతి పదిరోజులకు గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్**
**కొత్త జోనల్ కమిషనర్లకు సీఎం దిశానిర్దేశం**

హైదరాబాద్, డిసెంబర్ 30 (ఈవార్తలు): హైదరాబాద్ మహానగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయి ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. తెలంగాన రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకునేందుకు ఇటీవల గ్లోబల్ సమ్మిట్ వేదికగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ తరువాయి 2 వ పేజీలో...

## సర్కారుకు 'ట్రబుల్'

**అసెంబ్లీలో హరీశ్ రావుకు ప్రమోషన్**
**డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా నియామకం**
**తలసాని, సబితకు కూడా అవకాశం**
**మండలిలో రమణ, పోచంపల్లికి చాన్స్**
**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం**

బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, శాసనసభ, శాసనమండలిలో ప్రభుత్వ వైఫల్యాలను సమర్థవంతంగా ఎండగట్టేందుకు కొత్త నాయకత్వ బృందాన్ని ప్రకటించారు.

హైదరాబాద్, డిసెంబర్ 30 (ఈవార్తలు): పార్టీ సీనియర్ నేతలకు కీలక పదవులు కట్టబెడుతూ 'ప్రమోషన్లు' ఇచ్చారు. ప్రస్తుతం శాసనసభలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా కేసీఆ ర్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే, ఆయనకు తోడుగా సభలో పార్టీ గొంతుకను మరింత బలంగా వినిపించేందుకు ముగ్గురు సీనియర్ నేతలను డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా నియమించారు. ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీశ్ రావుకు ఈ కీలక పదవి దక్కడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ గణాంకాలను, వైఫల్యాలను ఎండగట్టడంలో ఆయన దిట్ట. తెలంగాణ ఉద్యమం సమయంలో కూడా హరీశ్ రావు డిప్యూటీ ఫ్లోర్ తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,620 |
| వెండి (గ్రాము): | రూ.258 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,180 |

## విశ్వవాణి




గంజాయిలోని పలు సమ్మేళనాలు అండాశయ క్యాన్సర్‌ను ప్రభావవంతంగా తగ్గించే లక్షణాలు ఉన్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. క్యాన్సర్ కణాలు విస్తరించకుండా అడ్డుకొనే గుణాలున్నట్లు తాము గుర్తించామని పరిశోధకులు పేర్కొన్నట్లు 'సైన్స్ డైలీ' వెల్లడించింది.



## మూడేళ్ల కనిష్టానికి..!

**భారీగా తగ్గిన రష్యా చమురు దిగుమతులు**
**అయినా అతిపెద్ద సరఫరాదారుగానే మాస్కో**

న్యూఢిల్లీ: అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా ముడి చమురు దిగుమతులు భారీగా తగ్గాయి. రియల్ టైమ్ డేటా అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ ప్రకారం, భారత్‌లోకి రష్యా ముడి చమురు దిగుమతులు డిసెంబర్‌లో రోజుకు దాదాపు 1.2 మిలియన్(12 లక్షల) బ్యారెళ్లకు (బీపీడీ) తగ్గింది. ఇది నవంబర్‌లో 1.84 మిలియన్(18.4 లక్షల) బీపీడీ కంటే గణనీయమైన క్షీణత. అంతేకాకుండా ఇది 2022, డిసెంబర్ -2 వ పేజీలో...

## భారత్ నం.4

### నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరణ

**జపాన్‌ను వెనక్కి నెట్టిన ఇండియా.. నీతి ఆయోగ్ వివరాలు వెల్లడి**

ప్రపంచ ఆర్థిక రంగంలో ఇండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. దశాబ్దకాలంగా స్థిరమైన వృద్ధిని కనబరు స్తున్న భారత్, ఇప్పుడు జపాన్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ అధికారికంగా వివరాలను వెల్లడించాయి. తాజా గణాంకాల ప్రకారం, భారత స్థూల దేశీయోత్పత్తి విలువ 4.18 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. దీనితో ఇప్పటివరకు నాలుగో స్థానంలో ఉన్న జపాన్‌ను (4.186 ట్రిలియన్ డాలర్ల అంచనా) భారత్ స్వల్ప తేడాతో అధిగమించింది.



న్యూఢిల్లీ: 2010లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థల జాబితాలో 10వ స్థానంలో ఉన్న భారత్, కేవలం 15 ఏళ్లలో 4వ స్థానానికి చేరుకోవడం విశేషం. 2019లో బ్రిటన్‌ను వెనక్కి నెట్టి 5వ స్థానాన్ని కైవసం చేసుకున్న భారత్, ఇప్పుడు జపాన్‌ను దాటేసి అమెరికా, చైనా, జర్మనీల సరసన నిలిచింది. ప్రభుత్వ అంచనాల ప్రకారం, ఇండియా ఇక్కడితో ఆగబోదు. వచ్చే రెండున్నర నుండి మూడు ఏళ్లలో జర్మనీని కూడా అధిగమించి, ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద తరువాయి 2 వ పేజీలో...




## అశ్లీల కంటెంట్‌పై కొరడా

### పిల్లలపై వేధింపుల కంటెంట్‌పై చర్యలేవి?

**సోషల్ మీడియా సంస్థలకు కేంద్రం వార్నింగ్**

న్యూఢిల్లీ: సోషల్ మీడియాలో రోజురోజుకు అశ్లీల, అభ్యంతరకర కంటెట్ పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలోనే దీనిపై తాజాగా కేంద్రం తీవ్రంగా స్పందించింది. పిల్లలపై లైంగిక వేధింపులు, అశ్లీల కంటెంట్‌పై కఠినంగా చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు ఆదేశాలు జారీ చేసింది. లేకపోతే చట్టపరంగా తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు



31.12.2025

**మేషం:** బంధు మిత్రులతో అకారణ కలహాలు కలుగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. మాతృ వర్గ బంధువుల మాటలు మానసికంగా బాధిస్తాయి. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి కావు వ్యాపారాలలో వ్యయ ప్రయాసలు అధికమవుతాయి.

**వృషభం:** గృహమున సంతోషకర వాతావరణం ఉంటుంది. సమాజంలో ప్రముఖుల పరిచయాలు ఉత్సాహనిస్తాయి. వ్యాపారాలు పురోగతి సాధిస్తారు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. ఆర్థికంగా కొంత మేలైన సౌకర్యాలుంటాయి. చిన్ననాటి మిత్రులతో ఉన్న మనస్పర్ధలు తొలగుతాయి.

**మిథునం:** సంతాన విద్యా విషయాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో నిరుత్సాహం తప్పదు. వ్యాపార ఉద్యోగాలలో ఒడిదుడుకులు ఉంటాయి. ఆర్థిక వ్యవహారాలు అంతంత మాత్రంగా ఉంటాయి. సన్నిహితులతో ఒక వ్యవహారంలో మనస్పర్ధలు కలుగతాయి.

**కర్కాటకం:** బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కారమవుతాయి. వృత్తి, ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఇంటాబయట సమస్యలు తెలివిగా పరిష్కరించుకుంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి.

**సింహం:** నూతన ఋణ ప్రయత్నాలు ఫలించవు. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి.సకాలంలో పనులు పూర్తికాక చికాకులు పెరుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవరోధాలు ఉంటాయి. సన్నిహితులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

**కన్య:** అన్ని రంగాల వారికి అనుకూల పరిస్థితులుంటాయి. ఆర్థిక పరిస్థితి ఆశజనకంగా ఉంటుంది. చేపట్టిన వ్యవహారాలలో.ఆకస్మిక విజయం సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో మీ విలువ మరింత పెరుగుతుంది. ఆప్తుల నుండి విలువైన సమాచారం అందుతుంది. వ్యాపారములలో కీలక నిర్ణయాలు అమలుపరుస్తారు.

**తుల:** వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. చేపట్టిన పనులలో ఆశించిన పురోగతి సాధిస్తారు. విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు లభిస్తాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. దూరప్రాంత బంధువుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి.

**వృశ్చికం:** ముఖ్యమైన పనులలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఇంటా బయట ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి ఉద్యోగాలు గందరగోళ పరిస్థితులుంటాయి. దైవ కార్యక్రమాలలో పాల్గొనటం మంచిది. ఆదాయానికి ఇబ్బందులు తప్పవు. నూతన ఋణయత్నాలు నిదానంగా సాగుతాయి.

**ధనస్సు:** మిత్రులతో అకారణ కలహాలు కలుగుతాయి. ముఖ్యమైన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో ఇతరుల విషయాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. ఆర్థిక పరిస్థితి కొంత నిరుత్సాహపరుస్తుంది. వృత్తి వ్యాపారాలలో వ్యయ ప్రయాసలు అధికామౌతాయి.

**మకరం:** సంఘంలో విశేషమైన గౌరవమర్యాదలు పొందుతారు. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలు అందుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు మరింత సానుకూలంగా సాగుతాయి.


**కుంభం:** ధన వ్యవహారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేయుట మంచిది. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరిగి మానసిక సమస్యలు కలుగుతాయి. వ్యాపార వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. దూర ప్రయాణాలలో జాగ్రత్త వహించాలి.

**మీనం:** నిరుద్యోగుల కష్టం ఫలించదు. నూతన కార్యక్రమాలు ప్రారంభించకపోవడం మంచిది. సంతాన అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తికాక ఒత్తిడి పెరుగుతుంది. కుటుంబ సభ్యుల మాటలు కొంత నిరాశ కలిగిస్తాయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి.

# సర్కారు మొద్దునిద్ర

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ జల దోపిడీ. నల్లమలసాగర్ అక్రమ నిర్మాణానికి సూత్రధారి చంద్రబాబు, పాత్రధారి రేవంత్ రెడ్డి' అని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. కత్తి చంద్రబాబుది అయినా పొడిచే వాడు రేవంత్ రెడ్డి అని తెలిపారు. 'రేవంత్ రెడ్డి జల ద్రోహానికి పాల్పడుతున్నాడు. ముఖ్యమంత్రినా లేక చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్నాడా?' అని ప్రశ్నించారు. 'బనకచర్ల ముప్పును ముందుగా పసిగట్టి బీఆర్ఎస్ పార్టీ రణభేరి మోగించింది. నేను ముల్లుకర్ర కాదు బల్లెం పెట్టి పొడిస్తే కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర లేవలేదు. మేం పోరాటం చేస్తున్న సమయంలో కేంద్రం, ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఏపీ, తెలంగాణతో మీటింగ్ పెట్టింది. పోను పోను అనుకుంటూనే బనకచర్ల మీటింగ్ ఉరికిండు. అపెక్స్ మీటింగ్‌కు కాకుండా వేరే ఏ రకమైన సమావేశానికి హాజరు కావొద్దని మేం ఆనాడు గట్టిగా హెచ్చరించాం' అని తెలిపారు. 'రేవంత్ రెడ్డి బండారాన్ని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు బయట పెట్టాడు. బనకచర్లను బంద్ పెడుతున్నామని పేరుకు ఏపీ ప్రకటించింది. ఉద్యమకారుల మీద రైఫిల్ ఎక్కుపెట్టి ఉద్యమకారున్ని అంటడు. సోనియా గాంధీని బలిదేవత అని తిట్టి వీర



కాంగ్రెస్ వాదిని అంటడు. బనకచర్ల మీద జంగ్ సైరన్ ఊది పోరాటానికి దిగింది మేం అయితే ఆపింది తామని జబ్బలు చరుచుకున్నాడు' అని అన్నారు. పేరుకు మాత్రమే వాళ్లు బనకచర్ల ప్రాజెక్టు ఆపుతున్నామని ప్రకటించినా ఆపలేదని ప్రకటించారు. 'తెలంగాణకు నీటి వాటా దక్కకుండా ఉండేందుకు కృష్ణాలో కలపకుండానే పెన్నా బేసిన్‌కు గోదావరి నీటిని తరలించే పెద్ద కుట్రకు రేవంత్ రెడ్డి తెరతీశాడు. పోలవరం బనకచర్ల విషయంలో కర్ణాటక, మహారాష్ట్రలు తీవ్ర అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు రాశాయి' అని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హరీశ్ రావు గుర్తుచేశారు. తెలంగాణతో సహా ఏ రాష్ట్రానికి నీటి వాటా దక్కకుండా చేసేందుకు గంపగుత్తగా నీళ్ల తరలించేందుకు పోలవరం నల్లమలసాగర్ ప్రాజెక్టుకు ఏపీ భారీ స్కెచ్ వేసింది' అని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. 'చంద్రబాబు దాసుడు, బాబు సూచించిన వ్యక్తి ఆదిత్య నాథ్ దాస్‌తో కమిటీ వేశాడు. అతడు దోపిడీదారుల ఏజెంటు, ఏపీకి నమ్మిన బంటు, ఇప్పుడు నీకు సలహాదారుడు, తెలంగాణకు వెన్నుపోటుదారుడు ఘనత వహించిన ఆదిత్యనాథ్ దాస్' అని హరీశ్ రావు వెల్లడించారు. 'అడుగడుగునా తెలంగాణ ఆకాంక్షలకు, నీటి హక్కులకు అడ్డంపడ్డ సైంధవుడు ఎవరు? ఇదే ఆదిత్యానాథ్ దాస్. తెలంగాణ నీళ్లు తెలంగాణకు దక్కకుండా ఎట్లా చేయవచ్చో ఆంధ్రా ప్రభుత్వానికి నేర్పించింది ఎవరు? ఇదే ఆదిత్యానాథ్ దాస్. తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవడానికి ఏపీ ప్రభుత్వ పక్షాన అత్యంత శ్రద్ధగా 100కి పైగా లేఖలు సంధించిందెవరు? ఇదే ఘనత వహించిన ఆదిత్యానాథ్ దాస్. రాయలసీమ ఎత్తిపోతల పనులను ఏపీ వేగంగా పూర్తి చేసేందుకు తోడ్పాడు అందించింది ఇదే ఆదిత్యానాథ్ దాస్' అని హరీశ్ పేర్కొన్నారు.




# భారత్ నం.4

మొదటి పేజీ తరువాయి

ఆర్థిక వ్యవస్థగా నిలవనుంది. 2030 నాటికి భారత జీడీపీ సుమారు 7.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా వృద్ధాప్యం వైపు వెళ్తుంటే, భారత్‌లో సగటు వయస్సు 28.8 ఏళ్లుగా ఉండటం వృద్ధికి ప్రధాన ఇంజిన్‌గా మారుతోంది.

**ఆర్థిక వృద్ధి దోహదాంశాలు:**

జీఎస్టీ, డిజిటల్ చెల్లింపులు (యూపీఏ), పీఎల్ఐ (పీఎల్ఐ) స్కీమ్స్ ద్వారా తయారీ రంగం బలోపేతం కావడం.

బలమైన ప్రైవేట్ వినియోగం మరియు గ్రామీణ మార్కెట్లలో పెరుగుతున్న కొనుగోలు శక్తి.

గ్లోబల్ మార్కెట్లో అనిశ్చితులు ఉన్నప్పటికీ, భారత్ ద్రవ్యోల్బణాన్ని నియంత్రణలో ఉంచుతూ 6.5% పైగా వృద్ధిని నమోదు చేస్తోంది.



# సర్కారుకు 'ట్రబుల్'

మొదటి పేజీ తరువాయి

లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ రాజకీయాల్లో బలమైన ముద్ర ఉన్న తలసాని శ్రీనివాస్ యాదవ్‌కి ఈ పదవితో నగర సమస్యలపై గళం ఎత్తే అవకాశం దక్కింది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నియామకంతో మహిళా పక్షపాతిగా బీఆర్ఎస్ తన వాణిని వినిపించనుంది. శాసనమండలిలో కూడా కేసీఆర్ తన మార్క్ నియామకాలు చేపట్టారు. ప్రభుత్వం మండలిలో ఇరకాటంలో పడేలా అనుభవజ్ఞులను రంగంలోకి దించారు. ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలను వీరిద్దరినీ మండలిలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా కేసీఆర్ నియమించారు. వెనుకబడిన తరగతుల నేతగా ఎల్.రమణకు, యువ నాయకుడిగా పోచంపల్లికి ప్రాధాన్యం లభించింది. ప్రముఖ కవి, కళాకారుడు దేశపతి శ్రీనివాస్‌ను మండలిలో పార్టీ విప్‌గా నియమించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సభలో పార్టీ క్రమశిక్షణను కాపాడటంతో పాటు, అంశాలవారీగా పార్టీ లైన్ ఇచ్చే బాధ్యత ఆయనపై ఉంటుంది.

# మూడేళ్ల కనిష్టానికి..!

మొదటి పేజీ తరువాయి

తర్వాత అత్యల్పమని డేటా పేర్కొంది. క్షీణత ఉన్నప్పటికీ, డిసెంబర్‌లో రష్యా భారతదేశానికి అతిపెద్ద చమురు సరఫరాదారుగా ఉంది. అయితే, రష్యా చమురు కంపెనీలు రోస్‌నెఫ్ట్, లుకో యిల్‌పై ఇటీవల అమెరికా ఆంక్షలు విధించడంతో పాటు, చమురు వ్యాపారం, షిప్పింగ్‌కు ఈయూ ఆంక్షల అంతరాయం కలిగింది. ఈ ఆంక్షల వల్ల రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌పీసీఎల్, హిందుస్తాన్ పెట్రోలియం, హెచ్‌పీసీఎల్-మిట్టల్ ఎనర్జీ, మంగళూరు రిఫైనరీ వంటి భారతీయ శుద్ధి కర్మాగారాలు



రష్యా ముడి చమురు కొనుగోలును తాత్కాలికంగా నిలిపివేశాయి. అయితే, ఈ సంస్థలు అనుమతి లేని రష్యా సంస్థల నుంచి చమురు కొనుగోలును కొనసాగిస్తున్నాయి. ఈ తగ్గుదల తాత్కాలికమేనని, మళ్లీ రష్యా చమురు దిగుమతులు పెరగవచ్చని నిపుణులు పేర్కొన్నారు.

## మరో ఆరుగురు ఐఏఎస్‌లు బదిలీ

మొదటి పేజీ తరువాయి

టి. వినయ్ కష్ణా రెడ్డి బదిలీ అయ్యారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నిజామాబాద్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. నల్లగొం డకు బదుగు చంద్రశేఖర్, నారాయణ పేట అడిషనల్ కలెక్టర్‌గా ఉమాశంకర్ ప్రసాద్, అదిలాబాద్ జాయింట్ కమిష నర్‌గా వై.శ్రీలీల, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్‌గా శ్రుతి ఓఝా నియమితులయ్యారు.

# అశ్లీల కంటెంట్‌పై కొరడా

మొదటి పేజీ తరువాయి

తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చింది. దీనికి సంబంధించి ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ ఆదేశించింది. అసభ్యకర, అశ్లీల కంటెంట్‌పై సోషల్ మీడియాలు కఠినంగా చర్యలు తీసుకోవడం లేదని ఐటీశాఖ ఆరోపించింది. ఐటీ చట్టంలోని సెక్షన్ 79 ప్రకారం థర్డ్‌పార్టీ సమాచారాన్ని ఆయా వేదికల్లో అప్‌లోడ్, ప్రచురణ లేదా వ్యాప్తి చేస్తే దీనికి సోషల్ మీడియా సంస్థలతో పాటు ఆయా ప్రచూరణ ప్లాట్‌ఫామ్‌లదే బాధ్యత అని వార్నింగ్ ఇచ్చింది. రూల్స్ పాటించకుంటే ఐటీ యాక్ట్, బీఎన్ఎస్‌తో పాటు ఇతర చట్టాల కింద సంబంధింత సంస్థలు, కష్టమర్లు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపింది.

# 'క్యూర్' చేద్దాం



మొదటి పేజీ తరువాయి

ఎకానమీ (క్యూర్) ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటికే క్యూర్ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని, పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని సీఎం తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ ను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుందని, హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన చెత్త నిర్వహణ సమస్యను సమర్థవంతంగా అధిగమించాలన్నారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని, సిటీలో ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించామన్నారు. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలని సూచించారు. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఈవీ బస్సులు, ఆటోలను తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త జోనల్ కమిషనర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్ లో ఉండాల్సిందేనని, జోన్ ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్ లదేనని స్పష్టం చేశారు. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడా, రోడ్లపై గుంతలు కనిపించకుండా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలన్నారు.

**గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు**

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలను అందించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. జనన మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువ పత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. ఆన్ లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని తెలిపారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్ మెంట్ అసోసియేషన్ లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. సుపరిపాలనతో పాటు స్మార్ట్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. క్యూర్ ఏరియాలో విభాగాల అధికారులను బాధ్యత స్పెషల్ సీఎస్ సమన్వయం చేసుకుంటారని తెలిపారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ చర్యలు చేపట్టాలని, ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని జోనల్ కమిషనర్లకు సీఎం సూచించారు.

**ప్రతి నెలకు ఒకసారి సమీక్ష**

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని హొటల్స్ లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. క్యూర్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలకు అందుబాటులో ఉన్న స్థలాన్ని కేటాయించి భవనాలు నిర్మించాలన్నారు. అద్దె భవనాల నుంచి సొంత భవనాలకు కార్యాలయాలను తరలించాలని అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలోని 12 జోన్లలో చెరువులు, కుంటలు, నాలాలను పూర్తిగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఆక్రమణలను తొలగించి వర్షాకాలంలో వరదలతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద చెరువులను గుర్తించి వాటిని పునరుద్ధరించి యాక్టివిటీ జోన్స్ గా అభివృద్ధి చేయాలని సూచించారు. జనవరి నుంచి ప్రతీ ఒక్కరూ ఫీల్డ్ ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే నగరం భవిష్యత్ మారుతుందన్నారు. ప్రతీ నెలకు ఒకసారి జోనల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సెక్రెటరీ మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కర్ణన్, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎండీ అశోక్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎఫ్ సీ డీఏ కమిషనర్ శశాంక, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో ప్రత్యేక సేవలు

**ప్రతి బుధవారం తోమాల సేవ**

**సరికొత్తగా తులాభారం సేవ**

**ప్రతిరోజూ సాయంత్రం సహస్ర దీపాలంకరణ**

**ఫిబ్రవరి నుంచి వాహన సేవలు**



యాదగిరిగుట్ట, డిసెంబర్ 30 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోనూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో ఆర్జిత సేవలను ప్రారంభించేందుకు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సేవలలో కొన్నిటిని వైకుంఠ ఏకాదశి నుంచి, మిగతా వాటిని ఫిబ్రవరి నెల నుంచి దశలవారీగా భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. కొత్తగా ప్రవేశపెట్టనున్న సేవల్లో భాగంగా ముందుగా తోమాల సేవను ప్రారంభించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సేవ ప్రతి బుధవారం ఉదయం 6.15 నుంచి 6.45 గంటల వరకు నిర్వహించనున్నారు. దంపతులు కలిసి పాల్గొనే ఈ సేవకు టికెట్ ధరను రూ.500గా నిర్ణయించారు. భక్తులు స్వామివారికి తోమాల సమర్పించి ప్రత్యేక ఆశీర్వాదాలు పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న విధానానికి భిన్నంగా తులాభారం సేవను సరికొత్తగా రూపొందించారు. ఈ సేవలో అవసరమైన నాణేలు, బెల్లం వంటి వస్తువులను ఆలయ అధికారులు స్వయంగా అందుబాటులో ఉంచనున్నారు. దీంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తులాభారం నిర్వహించుకునే అవకాశం కలగనుంది. వైకుంఠ ఏకాదశి తర్వాత ప్రతిరోజూ సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను ప్రారంభించనున్నారు. ఈ సేవకు టికెట్ ధర రూ.500గా నిర్ణయించగా, ఇందులో పాల్గొన్న భక్తులకు రెండు లడ్డూ ప్రసాదాలను ఉచితంగా అందజేయనున్నారు. ఇక ఇప్పటివరకు రథసప్తమి రోజుకే పరిమితమైన సూర్యప్రభ వాహన సేవను ఇకపై ప్రతి ఆదివారం ఉదయం 7.00 నుంచి 7.30 గంటల వరకు నిర్వహించనున్నారు. దంపతుల కోసం ఈ సేవ టికెట్ ధరను రూ.1,000గా నిర్ణయించారు. ఈ సేవలో పాల్గొనే భక్తులకు ఒక శాలువా, కనుమను ప్రసాదంగా అందజేస్తారు. అలాగే ఆలయ చరిత్రలో తొలిసారిగా చంద్రప్రభ వాహన సేవను కూడా ప్రారంభించనున్నారు. ఈ సేవకు కూడా టికెట్ ధర రూ.1,000గా నిర్ణయించగా, ప్రత్యేక వాహన సేవ ద్వారా భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నారు. వైకుంఠ ఏకాదశి నుంచే తోమాల సేవ, తులాభారం సేవ, సహస్ర దీపాలంకరణ సేవలు అందుబాటులోకి తీసుకువస్తుండగా, 2026 ఫిబ్రవరి 1వ తేదీ (మాఘ శుద్ధ పౌర్ణమి) నుంచి సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలను ప్రారంభించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. యాదగిరిగుట్టను ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అధికారులు తీసుకుంటున్న ఈ నిర్ణయాలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## టోల్ మినహాయింపు ఇవ్వండి

**కేంద్ర మంత్రి గడ్కరీకి కోమటిరెడ్డి లేఖ**



హైదరాబాద్, డిసెంబర్ 30 (ఈవార్తలు): తెలుగు రాష్ట్రాల ప్రజలకు అతిపెద్ద పండుగైన సంక్రాంతి సమీపిస్తున్న వేళ, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా పండుగ సమయంలో అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్%-%విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జనవరి 8వ తేదీ నుంచే హైవేలపై వాహన రద్దీ గణనీయంగా పెరిగే అవకాశముందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు సురక్షితంగా, సజావుగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో హైవేలపై మరమ్మతులు లేదా ఇతర కారణాలతో లేన్‌లను మూసివేసే పనులను పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. వాహనాల రాకపోకలకు అన్ని లేన్‌లు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ జామ్‌లను నివారించేందుకు కీలకమైన ప్రాంతాల్లో, జంక్షన్ల వద్ద అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలని మంత్రి ఆదేశించారు. అలాగే, ప్రయాణికులకు స్పష్టమైన సమాచారం ఇచ్చేలా సైన్ బోర్డులు, రాత్రి వేళల్లో కనిపించేలా హై విజిబిలిటీ బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు సంతోషంగా పండుగను జరుపుకునేలా, వారి ప్రయాణం సాఫీగా సాగేందుకు ప్రభుత్వం పూర్తి బాధ్యతతో పనిచేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. రద్దీ నేపథ్యంలో టోల్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర మంత్రి గడ్కరీకి లేఖ రాశారు.

## దుర్గం కబ్జాను కాపాడారు!

**5 ఎకరాలను స్వాధీనం చేసుకున్న హైడ్రా**

**మట్టితో పూడ్చి పార్కింగ్ పేరుతో నెలకు 50 లక్షల దందా**

హైదరాబాద్, డిసెంబర్ 30 (ఈవార్తలు): చారిత్రక దుర్గం చెరువును కబ్జాదారులు ఎలా కబళించారో కళ్లకు కట్టే సాక్ష్యాలను హైడ్రా బయటపెట్టింది. ఒకప్పుడు 160 ఎకరాల విస్తీర్ణంతో అలరారిన ఈ చెరువు, నేడు 116 ఎకరాలకు ఎలా కుంచించుకుపోయిందో వివరిస్తూ 'నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్' సహకారంతో శాటిలైట్ చిత్రాలను విడుదల చేసింది. దశాబ్దాలుగా సాగిన ఈ ఆక్రమణల పర్వాన్ని ఈ చిత్రాలు స్పష్టంగా బట్టబయలు చేస్తున్నాయి. గోల్కొండ కోట నివాసులకు దాహార్తిని తీర్చిన ఈ 'సీక్రెట్ లేక్'.. నేడు కబ్జాల చెరలో చిక్కుకుంది. హైడ్రా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 1976 నాటికే దుర్గం చెరువులో 29 ఎకరాలు కబ్జాకు గురై 131.66 ఎకరాలకు తగ్గింది. ఆ తర్వాత 1995 వరకు సురక్షితంగా ఉన్నప్పటికీ, 1995 నుంచి 2000 మధ్య మరో 10 ఎకరాలు అన్యాక్రాంతమై 121 ఎకరాలకు పడిపోయింది. 2000 సంవత్సరం నుంచి నేటి వరకు మరో 5 ఎకరాలు కబ్జా కోరల్లోకి వెళ్లినట్లు శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వైపు దాదాపు 5 ఎకరాల మేర జరిగిన ఆక్రమణలను హైడ్రా మంగళవారం విజయవంతంగా తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కబ్జాలను నిర్ధారించుకున్నారు. అక్కడ 10 నుంచి 15 మీటర్ల మేర మట్టిని చెరువులో డంప్ చేసి, ఆ స్థలాన్ని చదును చేసి భారీ పార్కింగ్ దందాను నడిపిస్తున్నారు. స్కూల్ బస్సులు, ఐటీ ఉద్యోగుల క్యాబ్‌ల పార్కింగ్ కోసం ఈ స్థలాన్ని వాడుతూ, నెలకు దాదాపు రూ.50 లక్షల వరకు అద్దెలు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఓ ప్రజాప్రతినిధి అండదండలతోనే ఈ వ్యవహారం నడుస్తోందని, ఆక్రమిత స్థలం తనదేనంటూ సదరు ప్రజాప్రతినిధి క్లైమ్ చేస్తున్నట్లు సమాచారం. ఎలాంటి భూ రికార్డులు లేకుండానే ఏళ్ల తరబడి ఈ దందా సాగుతోంది. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కూడా ఈ ఆక్రమణలు అడ్డుగా మారాయి. మంగళవారం జరిగిన ఆపరేషన్‌లో హైడ్రా అధికారులు పార్కింగ్‌లోని వాహనాలను ఖాళీ చేయించి, ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారు. త్వరలోనే డంప్ చేసిన మట్టిని కూడా తొలగించి చెరువు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు.



# తగ్గిన క్రైం రేటు

**పెరిగిన నమ్మకద్రోహం.. పోలీస్ వార్షిక నివేదికలో వెల్లడి**



హైదరాబాద్, డిసెంబర్ 30 (ఈవార్తలు): రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో నేరాల సంఖ్య 2.33 శాతం తగ్గిందని ఆయన వెల్లడించారు. తెలంగాణ పోలీస్ వార్షిక నివేదిక-2025 ను ఆయన మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది 2,34,158 కేసులు నమోదు అయితే 2025 సంవత్సరంలో 2.28,69 కేసులు నమోదయ్యాయని తెలిపారు. బీఎన్ఎస్ కేసులు 2024 లో 1,69,477 నమోదు అయితే 2025లో 1,67,018 కేసులు నమోదు అయ్యాయని ఇవి గతేడాదితో పోలిస్తే 1.45 శాతం తగ్గినట్లు వెల్లడించారు.

**509 మంది నక్సల్స్ లొంగుబాటు**

ఈ ఏడాది 509 మంది నక్సల్స్ లొంగిపోయారని.. వారిలో 481 మంది ఛత్తీస్‌గఢ్, 21 మంది తెలంగాణ, ఒకరు మహారాష్ట్ర, ఒకరు ఏపీ నక్సల్స్ ఉన్నారని తెలిపారు. నాలుగు నేషనల్ లోక్ అదాలత్, 1 స్పెషల్ అదాలత్ నిర్వహించమన్నారు. 7 లక్షల కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని చెప్పారు. పోలీస్ శాఖను హైకోర్టు అభినందించిందని వెల్లడించారు. మూడు అంతర్జాతీయ ఈవెంట్స్ సక్సస్ ఫుల్‌గా నిర్వహించామని తెలిపారు. తెలంగాణలో మహిళా పోలీసు అధికారులు బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. సీఐడీ చీఫ్, ఏసీబీ డీజీ చారు సిన్హా, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్రా, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్గా శిఖా గోయల్, ఎస్ఐబీ ఐజీ సుమతి వారిలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్లో క్యూఆర్ కోడ్ పెట్టడం జరిగిందని, ఫీడ్ బ్యాక్ కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేర నిరూపణ శాతం 3.09 శాతం పెరిగిందని ఇది గతేడాది 35.63 శాతం ఉంటే ఈ ఏడాది 38.72 శాతం ఉందని తెలిపారు. ఈ ఏడాది నాలుగు కేసుల్లో మరణశిక్ష విధించబడిందన్నారు. 216 కేసుల్లో 320 మందికి యావజ్జీవ శిక్ష పడిందని చెప్పారు. పోక్సో చట్టం కింద నమోదైన మొత్తం 141 కేసుల్లో ఈ ఏడాది 154 మంది నిందితులకు జీవిత ఖైదు విధించబడిందని, 3 కేసుల్లో నిందితులకు మరణ శిక్ష పడిందని తెలిపారు. ఎస్సీ ఎస్టీ చట్టం 28 కేసుల్లో 53 మంది నిందితులకు జీవిత ఖైతు విధించబడిందని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు, మిస్ వరల్డ్ పోటీలు, ఫుట్బాల్ ఆటగాడు మెస్సీ ప్రోగ్రామ్, వరదలు వంటి విపత్తులతో కూడిన ముఖ్యమైన ఈవెంట్లను తెలంగాణ పోలీస్ సమర్థవంతంగా నిర్వహించిందని చెప్పారు.

**పెరిగిన డ్రగ్స్ కేసులు**

తెలంగాణలో డ్రగ్స్ కేసులు భారీగా పెరిగాయని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే 30 శాతం డ్రగ్స్ కేసులు పెరిగినట్లు చెప్పారు. వేరే రాష్ట్రాల్లో ఉన్న నిందితులను ఈగల్ టీమ్ పట్టుకొస్తోందన్నారు. ఈగల్ టీమ్ ఈ ఏడాది రూ.173 కోట్ల డ్రగ్స్ సీజ్ చేసిందని అన్నారు. నమ్మక ద్రోహం కేసులు తెలంగాణలో 23 శాతం పెరిగాయన్నారు. ఐపీసీ సెక్షన్ కింద కేసులు 7.83 % పెరిగాయని.. అలాగే మహిళలపై దాడులు కేసులు 2.90 % పెరిగాయని అన్నారు. 248 మంది మహిళల హత్యలకు గురైయ్యారని తెలిపారు. రేప్ కేసులు 13% తగ్గిందని, కిడ్నాప్‌లు 10% , వేధింపులు కేసులు 9% తగ్గాయని అన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఈ ఏడాది 23% రికవరీ చేసిందని... రూ. 246 కోట్లు రికవరీ అయినట్లు తెలిపారు. 25,500 మంది బాధితులకు రూ.159 కోట్లు రీ ఫండ్ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది 1.20 లక్షల సెల్ ఫోన్లు ట్రేస్ చేయడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని వెల్లడించారు.దేశంలో 41 శాతం సైబర్ నేరాలు పెరిగితే.. తెలంగాణలో 3 శాతం సైబర్ నేరాలు తగ్గాయన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 2.33% క్రైమ్ రేట్ తగ్గిందని వివరించారు. ఈ ఏడాది 2.28 లక్షలు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు.

**నయీమ్ భూములు కొనద్దు**

ప్రైవేటు సంస్థల్లో మహిళల కోసం కమిటీలు ఏర్పాటు చేశామని.. పోష్ యాక్ట్‌ను తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో ఈ ఏడాది ఫిల్మ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయబోతున్నామని.. ఇందులో 18 నుంచి 35 ఏళ్ళు లోపు ఉన్న వారు హాజరువుతారని తెలిపారు. టీజీ ఆర్టీసీ డ్రైవర్లను ఈ ఏడాది పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా పరీక్ష నిర్వహించామన్నారు. నయీమ్ కేసు సీఐడీ విచారణలో ఉందన్నారు. నయీమ్ కేసులో సీజ్ అయిన ల్యాండ్స్, చాలా మంది అమ్మాలని ప్రయత్నం చేశారని తెలిపారు. నయీమ్ లాండ్స్‌పై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. ఆ ల్యాండ్ ఎవరూ కొనవద్దని, అమ్మవద్దని ఆదేశాలు ఉన్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ఇక, డ్యూటీ మీట్ అండ్ స్పోర్ట్స్ ఈవెంట్లలో తెలంగాణ పోలీసులు తమ సత్తా చాటారని డీజీపీ వెల్లడించారు. నిర్వహించిన 68వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ లో తెలంగాణ పోలీసులు 18 పతకాలతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచినట్లు వెల్లడించారు ప్రపంచ పోలీస్ ఫైర్ గేమ్స్ లో తెలంగాణ పోలీసులు 10 పతకాలు సాధించారని పేర్కొన్నారు.

## కూతురిని గర్భవతిని చేసిన తండ్రి

**గద్వాలలో అమానవీయ ఘటన**

గద్వాల, డిసెంబర్ 30 (ఈవార్తలు): గద్వాల జిల్లాలో సభ్యసమాజం తలదించుకునే దారుణ ఘటన వెలుగుచూసింది. రక్షించాల్సిన తండ్రే భక్షకుడిగా మారి కన్న కూతురిపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. మైనర్ అని కూడా చూడకుండా లైంగిక దాడి చేసి ఆమెను గర్భవతిని చేశాడు. ఈ పాపానికి నిందితుడి మొదటి భార్య సహకరించడమే కాకుండా, బాలికకు అబార్షన్ చేయించి విషయం బయటకు రాకుండా జాగ్రత్తపడింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో పోలీసులు నిందితులిద్దరినీ అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తికి కొన్నేళ్ల కిందట వివాహమైంది. పిల్లలు పుట్టకపోవడంతో భార్య చెల్లిని రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆమెకు నలుగురు పిల్లలు పుట్టగా, అనంతరం మొదటి భార్యకు కూడా ఇద్దరు పిల్లలు కలిగారు. అందరూ కలిసి ఒకేచోట ఉంటున్నారు. అయితే, ఆ వ్యక్తి వక్రబుద్ధితో తన రెండో భార్య కూతురు (16)పై కన్నేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చింది. ఈ విషయం నిందితుడి మొదటి భార్యకు తెలిసింది. విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని భావించిన ఆమె.. భర్తను మందలించాల్సింది పోయి అతనికి సహకరించింది. గుట్టుచప్పుడు కాకుండా బాలికకు అబార్షన్ చేయించింది. అయితే, బాధితురాలు ఇటీవల తన నరకయాతనను స్థానికంగా ఉండే ఓ మహిళకు చెప్పుకుని కన్నీరుమున్నీరైంది. దీంతో ఆ మహిళ వెంటనే బాలిక తల్లికి సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘోరం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి.. అఘాయిత్యానికి పాల్పడిన తండ్రితో పాటు అతనికి సహకరించిన మొదటి భార్యను అదుపులోకి తీసుకున్నారు.



## ప్రవేశపరీక్షల షెడ్యూల్ విడుదల

**మే 4 నుంచి 11 వరకు ఈఏపీసెట్ నిర్వహణ**

**మే నెలలోనే ఎడ్‌సెట్ ఐసెట్ లాసెట్ పరీక్షలు**

హైదరాబాద్, డిసెంబర్ 30 (ఈవార్తలు): తెలంగాణలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారికంగా విడుదల చేసింది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ సీట్ల కోసం నిర్వహించే ఈఏపీసెట్‌తో పాటు ఐసెట్, ఈసెట్, లాసెట్ వంటి అన్ని ముఖ్యమైన పరీక్షల తేదీలను ఖరారు చేసింది. జేఎన్‌టీయూ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈఏపీసెట్ పరీక్షలు మే నెలలో జరగనున్నాయి. ఈ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారిత (ఆన్‌లైన్) విధానంలోనే నిర్వహించనున్నారు.

### పరీక్షల తేదీల వివరాలు

- **టీజీ ఈఏపీసెట్ (అగ్రికల్చర్, ఫార్మసీ): మే 4, 5 తేదీల్లో**
- **టీజీ ఈఏపీసెట్ (ఇంజినీరింగ్): మే 9 నుంచి 11 వరకు**
- **టీజీ ఎడ్‌సెట్: మే 12న**
- **టీజీ ఐసెట్: మే 13, 14 తేదీల్లో**
- **టీజీ ఈసెట్: మే 15న**
- **టీజీ లాసెట్: పీజీ ఎల్‌సెట్: మే 18న**
- **టీజీ పీజీ ఈసెట్: మే 28 నుంచి 31 వరకు**
- **టీజీ పీఈసెట్: మే 31 నుంచి జూన్ 3 వరకు**

## డల్లాస్‌లో గుండెపోటుతో చౌటుప్పల్ యువకుడి మృతి

చౌటుప్పల్, డిసెంబర్ 30 (ఈవార్తలు): ఉన్నత చదువులు చదివి, అమెరికాలో మంచి ఉద్యోగం సంపాదించి, మరికొద్ది రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన ఓ యువకుడు గుండెపోటుతో మరణించిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో విషాదాన్ని నింపింది. చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గోశిక యశ్వంత్ కుమార్ (33) అమెరికాలోని డల్లాస్‌లో సోమవారం గుండెపోటుతో చనిపోయాడు. వివరాల్లోకి వెళితే.. చౌటుప్పల్‌కు చెందిన గోశిక వెంకటేశం, గాయత్రీ దంపతులకు నలుగురు కుమారులు. వీరిలో యశ్వంత్ రెండో కుమారుడు. గత కొంతకాలంగా డాలస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యశ్వంత్, సోమవారం నిద్రలోనే గుండెపోటుతో తుదిశ్వాస విడిచాడు. ఉదయం ఎంతకీ లేవకపోవడంతో గమనించిన స్నేహితులు.. మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అత్యంత విషాదకరమైన విషయం ఏమిటంటే.. యశ్వంత్‌కు ఇటీవలే పెళ్లి నిశ్చయమైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 21న వివాహానికి ముహూర్తం కూడా ఖరారు చేశారు. పెళ్లి పనుల కోసం మరికొద్ది రోజుల్లోనే స్వగ్రామానికి వచ్చేందుకు యశ్వంత్ సిద్ధమవుతున్నాడు. ఇంతలోనే ఈ ఘోరం జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పెళ్లికొడుకుగా చూడాలనుకున్న బిడ్డను విగతజీవిగా చూడాల్సి రావడం ఆ తల్లిదండ్రుల గుండెలను పిండేస్తోంది. చేతికొచ్చిన కొడుకు అకాల మరణంతో చౌటుప్పల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, యశ్వంత్ మృతదేహాన్ని గురువారం నాటికి చౌటుప్పల్‌కు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## ట్రాన్స్‌జెండర్లకు 100% సబ్సిడీ రుణాలు



హైదరాబాద్, డిసెంబర్ 30 (ఈవార్తలు): తెలంగాణలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సమాజంలో ట్రాన్స్‌జెండర్లు (హిజ్రాలు) కూడా గౌరవప్రదమైన జీవనం సాగించేలా, ఆర్థికంగా సొంత కాళ్లపై నిలబడేలా భరోసా కల్పిస్తోంది. ఇందులో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ట్రాన్స్‌జెండర్లకు 100 శాతం సబ్సిడీతో రుణాలు అందించేందుకు ముందుకొచ్చింది. ఈ పథకం ద్వారా అర్హులైన వారికి రూ.75 వేల వరకు రుణం మంజూరు చేయనున్నారు. ఇది పూర్తిగా సబ్సిడీతో కూడుకున్నది కావడంతో లబ్ధిదారులు తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఏదైనా రంగంలో నైపుణ్య శిక్షణ పొంది, సొంతంగా చిరు వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి ఈ సాయం అందిస్తారు. 18 నుంచి 55 ఏళ్ల వయస్సు ఉన్న ట్రాన్స్‌జెండర్లు ఈ పథకానికి అర్హులని దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సాధికారిత శాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్ జిల్లాకు సంబంధించి ఈ పథకం కింద 30 స్వయం ఉపాధి యూనిట్లను ప్రభుత్వం కేటాయించింది. ఆసక్తి గల అభ్యర్థులు నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్‌లో ఉన్న కార్యాలయంలో అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. లేదా షషష.షఎంఫ్.వశ్రీఖఅస్త్రుఖఋ.ప్రశీజ.ఱఅ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వచ్చే నెల (జనవరి) 31వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. అందిన దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీ పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేస్తుంది. మరిన్ని వివరాల కోసం 9640452773 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## ఏపీకి ప్రత్యేక బస్సులు

**బీహెచ్ఈఎల్ డిపో నుంచి ఏపీ నగరాలకు సర్వీసులు**

**జనవరి 9 నుంచి 13 వరకు అందుబాటులో బస్సులు**

హైదరాబాద్, డిసెంబర్ 30 (ఈవార్తలు): తెలుగు లోగిళ్లలో అతిపెద్ద పండగ సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ (టీజీఎస్ ఆర్టీసీ) శుభవార్త చెప్పింది. ఇప్పటికే రైళ్లలో రిజర్వేషన్లు దొరక్క, రెగ్యులర్ బస్సులు నిండిపోవడంతో ఇబ్బంది పడుతున్న వారి కోసం ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. ముఖ్యంగా హైదరాబాద్ శివారు ప్రాంతాలైన బీహెచ్ఈఎల్, మియాపూర్ వైపు నివసించే వారి సౌకర్యార్థం బీహెచ్ఈఎల్ డిపో నుంచి ఏపీకి స్పెషల్ సర్వీసులను ప్రకటించింది. బీహెచ్ఈఎల్ డిపో (ఆర్సీపురం) నుంచి ఏపీలోని పలు జిల్లాలకు ఈ ప్రత్యేక బస్సులు నడవనున్నాయి. ఈ బస్సులు ఆర్సీపురం నుంచి బయలుదేరి మియాపూర్, కేపీహెచ్‌బీ, ఔటర్ రింగ్ రోడ్ మీదుగా వెళతాయి. ఇవి ప్రధానంగా విజయవాడ, గుంటూరు, చీరాల, రాజమండ్రి, అమలాపురం, కాకినాడ, నర్సాపురం, విశాఖపట్నం, పోలవరం తదితర ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తాయని బీహెచ్ఈఎల్ డిపో మేనేజర్ సుధా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక సర్వీసులు జనవరి 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు. రద్దీని బట్టి అదనపు బస్సులను పెంచేందుకు కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ స్పెషల్ బస్సులకు సంబంధించిన పూర్తి వివరాలకు 9959226149 నెంబరును సంప్రదించవచ్చు. ప్రస్తుతం ప్రైవేట్ ట్రావెల్స్ టికెట్ ధరలు విమాన చార్జీలతో పోటీపడుతున్న తరుణంలో ఆర్టీసీ కల్పిస్తున్న ఈ తక్కువ ధర సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.



## గిన్నిస్ రికార్డుల్లో ఆకుల నవ్యశ్రీ

గచ్చిబౌలి, డిసెంబర్ 30 (ఈవార్తలు): హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 4,608 మంది కళాకారులు నిమిషాలపాటు కూడిపూడి నృత్యం చేసి గిన్నిస్ రికార్డును నెలకొల్పారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళా వైభవం-2 పేరుతో నిర్వహించిన ఈ ప్రదర్శనలో తెలుగు రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి వచ్చిన కళాకారులు ఉత్సాహంగా పాల్గొని నాట్యం చేశారు. 2023లో ఇదే అకాడమీ ఆధ్వర్యంలో 4,218 మందితో నిర్వహించిన ప్రదర్శన గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. తాజాగా దాన్ని అధిగమించి మరో రికార్డును సృష్టించారు. ఈ రికార్డు నృత్య ప్రదర్శనలో ఆకుల నవ్య శ్రీ పాల్గొని భాగస్వామిగా నిలిచింది. కొద్ది నెలలు నుంచి కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్న చిన్నారి ఈ ప్రదర్శనలో పాల్గొని నృత్య ప్రదర్శన చేసింది. భాష్యం స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న చిన్నారి నవ్య శ్రీ ప్రదర్శనతో ఎంతో మందిని ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో భాగస్వామిగా నిలిచిన చిన్నారికి భారత్ ఆర్ట్స్ అకాడమీ ప్రశంసా పత్రాన్ని, బహుమతిని ప్రధానం చేసింది. చిన్నారి ప్రదర్శన పట్ల తల్లిదండ్రులు అరవింద్, లక్ష్మి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికేచిన్నారి అనేక చోట్ల నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనల్లో పాల్గొని ఔరా అనిపిస్తోంది.



## 31 సాయంత్రం నుంచే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

మల్యాల, డిసెంబర్ 30 (ఈవార్తలు): నూతన సంవత్సర వేడుకలు శాంతియుత వాతావరణంలో కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని మల్యాల ఎస్సై నరేశ్ కుమార్ సూచించారు.కొత్త సంవత్సరం సందర్భంగా మద్యం సేవించి రోడ్లపై వాహనాలు ర్యాష్ నడపకూడదన్నారు. ప్రధాన కూడలిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని, బహిరంగ ప్రదేశాల్లో స్పీకర్లు, సౌండ్ బాక్సులు వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 31 సాయంత్రం నుంచే డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

## కొండగట్టులో ఉత్తర ద్వార దర్శనం

### భారీగా తరలివచ్చిన భక్తులు

మల్యాల, డిసెంబర్ 30 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు పూలమాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీకాంతారావు, సర్పంచ్ దారం ఆదిరెడ్డి, స్వామివారి పూజలో పాల్గొన్నారు. ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు, కుటుంబ సమేతంగా తరలివచ్చారు. ఆలయంలో కలెక్టర్ సత్యప్రసాద్ దంపతులు, ఆర్డీవో మధుసూదన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు దంపతులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## 14 నుంచి సనాతన జాగారణ, దేశ కల్యాణ యజ్ఞయాత్ర

హైదరాబాద్, డిసెంబర్ 30 (ఈవార్తలు): మహర్షి దయానంద సరస్వతి జన్మద్వి శతాబ్ది, స్వామి శ్రద్ధానంద సరస్వతి బలిదాన శతాబ్ది, ఆర్య సమాజ స్థాపన సార్థ శతాబ్ది సందర్భంగా 'సనాతన జాగారణ, దేశ కల్యాణ యజ్ఞయాత్ర' ను జనవరి 14న తేదీన చేపట్టనున్నట్టు నిర్వాహకులు ఆచార్య తేజస్సు తెలిపారు. తమిళనాడులోని రామేశ్వరం ఆలయం నుంచి ప్రారంభమై ఈ యాత్ర 16 రాష్ట్రాల మీదుగా 9,600 కిలోమీటర్ల పైగా ప్రయాణించి ఫిబ్రవరి 26న జమ్మూ కాశ్మీర్లోని శ్రీనగర్ లాల్ చౌక్ వద్ద ముగుస్తుందని తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నరేంద్ర ఆర్య, డాక్టర్ ధర్మ తేజతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ యాత్రలో భాగంగా 100కు పైగా ప్రదేశాలలో వేదా అధ్యయనం, యజ్ఞ యాగాదులు, గో సేవ, గోపాలన వంటి అంశాలపై ప్రవచనాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా ప్రాంతీయ భాషలలో సాహిత్యాన్ని పంపిణీ చేయడం ద్వారా సన్నతన ధర్మ ప్రచారం విస్తృతంగా నిర్వహిస్తామన్నారు. యాత్రకు ముందు జనవరి 3న ఉదయం 10 గంటలకు హైదరాబాదు గండిపేట సిబిఐటి ఖానాపూర్ లోనీ వేద గురుకులం అగ్ని పురం వద్ద అఖండ జ్యోతి (అరణి మంథన) వెలిగిస్తామని పేర్కొన్నారు. అఖండ జ్యోతి కార్యక్రమానికి విశిష్ట ఆహ్వానితులుగా పూజ ఆచార్య ప్రద్యుమ్న ( హర్యానా), సమతా మూర్తి విగ్రహ ప్రతిష్టాపకులు శ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి , పద్మశ్రీ ఆచార్య సుకామా హాజరవుతారని ఆచార్య తేజస్సు తెలిపారు.







## దుర్గగుడిలో కరెంట్ కట్ కానివ్వం

### మంత్రి గొట్టిపాటి రవికుమార్

విజయవాడ, డిసెంబర్ 30 (ఈవార్తలు): ఇటీవల విజయవాడ కనకదుర్గ ఆలయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టత ఇచ్చారు. ఇది కేవలం అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా జరిగిన ఘటన అని, విద్యుత్ సరఫరాలో సాంకేతిక లోపాలు లేవని స్పష్టం చేశారు. కరెంట్ కేవలం 10 నిమిషాలు మాత్రమే నిలిచిపోయిందని, విషయం తెలిసిన వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు జనవరి 6 లేదా 7 తేదీల్లో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈవో, ఇతర ముఖ్య అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ చిన్న పొరపాటును ఆసరాగా చేసుకుని రాజకీయ విమర్శలు చేయడం తగదని వైసీపీ నేతలకు హితవు పలికారు. ప్రజల మనోభావాలతో ముడిపడిన అంశాలపై అనవసర రాద్ధాంతం చేయడం, ప్రతి సాధారణ విషయాన్ని రాజకీయాలకు వాడుకోవడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిపోయిందని మంత్రి మండిపడ్డారు. ఏ ధర్మాన్నైనా, సంప్రదాయాలనైనా చిత్తశుద్ధితో కాపాడేది ఒక్క కూటమి ప్రభుత్వమేనని గొట్టిపాటి రవికుమార్ ఉద్ఘాటించారు.


## యూట్యూబర్ అన్వేష్ దిష్టిబొమ్మ దగ్ధం

ములుగు, డిసెంబర్ 30 (ఈవార్తలు): హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ అన్వేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ములుగు జిల్లా మంగపేటలోని వైఎస్ఆర్ సెంటర్‌లో బీజేపీ శ్రేణులు నిరసనకు దిగాయి. యూట్యూబర్ అన్వేష్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు రావుల జానకిరావు మాట్లాడుతూ, హిందూ సమాజాన్ని కించపరిచేలా, మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం తీవ్రమైన తప్పిదమని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో సమాజంలో ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా



స్పందించి యూట్యూబర్ అన్వేష్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో అన్వేష్ నడుపుతున్న యూట్యూబ్ చానల్‌ను కూడా తక్షణమే నిషేధించాలని బీజేపీ నేతలు కోరారు. సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తూ మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వారిని కట్టడి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. యూట్యూబ్ వంటి డిజిటల్ మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, లేదంటే ప్రజా ఆందోళనలు మరింత ఉధృతం అవుతాయని బీజేపీ నేతలు హెచ్చరించారు.

## భోగాపురం ఎయిర్ పోర్టుకు 4న తొలి విమానం



### ట్రయల్ ఫ్లైట్ లో ఢిల్లీ నుంచి రామ్మోహన్ నాయుడు రాక

భోగాపురం, డిసెంబర్ 30 (ఈవార్తలు): ఉత్తరాంధ్ర వాసుల చిరకాల స్వప్నమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ముస్తాబవుతోంది. ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తికావడంతో, అధికారులు కీలకమైన ట్రయల్ రన్‌కు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా జనవరి 4న భోగాపురం ఎయిర్‌పోర్టులో తొలి కమర్షియల్ ఫ్లైట్ దిగనుంది. ఫైనల్ టెస్ట్ రన్‌లో భాగంగా ఢిల్లీ నుంచి బయలుదేరే ఎయిర్ ఇండియా విమానం జనవరి 4న ఉదయం 11 గంటలకు భోగాపురం ఎయిర్‌పోర్టుకు చేరుకోనుంది. ఈ చారిత్రాత్మక ఘట్టంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొననున్నారు. ఆయనతో పాటు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, డీజీసీఏ ఉన్నతాధికారులు అదే విమానంలో ఇక్కడికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలించనున్నారు. మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చొరవతో విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా సాగాయి. ప్రస్తుతం 95 శాతం పనులు పూర్తయ్యాయని, కేవలం 5 శాతం పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. మిగిలిన పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసి, ఆగస్టు నెలలో విమానాశ్రయాన్ని పూర్తిస్థాయిలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జనవరి 4న జరిగే ఈ చివరి ట్రయల్ రన్ విజయవంతం అయిన తర్వాత, ఎయిర్‌పోర్ట్ నుంచి రాకపోకలు సాగించేందుకు సిద్ధంగా ఉన్న ఇతర విమానయాన సంస్థలతో మంత్రిత్వ శాఖ చర్చలు జరపనుంది. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే విజయనగరం, విశాఖపట్నంతో పాటు మొత్తం ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి, పర్యాటక రంగానికి పెద్ద ఊపు లభిస్తుందని అంచనా వేస్తున్నారు.



## లంబాడిపల్లిలో ఘనంగా ముక్కోటి ఏకాదశి

మల్యాల, డిసెంబర్ 30 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం లంబాడిపల్లిలో శ్రీ పద్మావతి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్తర ద్వారదర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు మరాటి సత్తన్న, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



## మల్యాలకు సాయం చేయండి

### కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు సర్పంచ్ వినతి

మల్యాల, డిసెంబర్ 30 (ఈవార్తలు): మల్యాలను సర్వతోముఖాభివృద్ధి దిశగా అభివృద్ధి చేసేందుకు సాయం అందించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మల్యాల సర్పంచ్ బొట్ల జయ-ప్రసాద్ కోరారు. మంగళవారం కేంద్రమంత్రిని కలిసిన ఆమె.. గ్రామంలోని పలు సమస్యలను తెలియజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన బండి సంజయ్.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బొట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ గ్రూప్-2పై పిటిషన్లు కొట్టివేత

అమరావతి, డిసెంబర్ 30 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 అభ్యర్థులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గ్రూప్-2 నియామకాల్లో రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లన్నింటినీ ఏపీ హైకోర్టు కొట్టివేసింది. మంగళవారం వెలువడిన ఈ తీర్పుతో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఈ నిర్ణయం లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపశమనం కలిగించింది. 2023లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) జారీ చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్‌పై పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రధానంగా మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులు (ఎక్స్-సర్వీస్‌మెన్), క్రీడాకారులకు కేటాయించిన ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు నిబంధనల ప్రకారం లేవని పిటిషనర్లు ఆరోపించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను సరిచేసి, పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్తది జారీ చేయాలని కోరారు. దీనిపై సమగ్ర విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చుతూ తీర్పు వెలువరించింది. అన్ని పిటిషన్లను కొట్టివేయడంతో నియామక ప్రక్రియకు మార్గం సుగమమైంది. ఇప్పటికే గ్రూప్-2 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో, ఈ తీర్పు అభ్యర్థుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. రోస్టర్ పాయింట్ల వివాదంతో నియామకాలు ఎక్కడ ఆగిపోతాయోనని ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు ఈ తీర్పు ఊరటనిచ్చింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో ఏపీపీఎస్సీ తదుపరి నియామక ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉంది.

## ఎమ్మెల్యే విరూపాక్షికి జగన్ పరామర్శ

ఆలూరు, డిసెంబర్ 30 (ఈవార్తలు): కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని వైసీపీ అధినేత జగన్ సోమవారం నాడు పరామర్శించారు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో విరూపాక్షి రెండు మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ క్రమంలో, ఆయనకు జగన్ ఫోన్ చేసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



## దుర్గగుడిలో తలనీలాల వేలానికి రికార్డు ధర

### 10.10 కోట్లకు దక్కించుకున్న ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్

విజయవాడ, డిసెంబర్ 30 (ఈవార్తలు): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆలయంలో తలనీలాల వేలం పాట రికార్డు సృష్టించింది. భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించే తలనీలాలను సేకరించే హక్కులకు సంబంధించి ఆలయ అధికారులు నిర్వహించిన వేలం పాటలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ధర పలికింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన 'ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్' సంస్థ రూ.10.10 కోట్లకు ఈ టెండర్‌ను దక్కించుకుంది. గతంతో పోలిస్తే ఈసారి ఆలయానికి ఆదాయం భారీగా సమకూరింది. రెండేళ్ల క్రితం జరిగిన వేలంలో తలనీలాల సేకరణ ద్వారా ఆలయానికి రూ.5.67 కోట్లు మాత్రమే రాగా, ఈసారి అది దాదాపు రెట్టింపు కావడం విశేషం. తాజా ఒప్పందం ప్రకారం 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.10.10 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాతి ఏడాది (2027-28)కి మరో 10 శాతం అదనంగా, అంటే రూ.11.11 కోట్లకు టెండర్ ఖరారైంది. దుర్గగుడిలోని మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో ఈ వేలం పాటను అధికారులు నిర్వహించారు. ఈ వేలంలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి మొత్తం 19 మంది కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఈ-టెండర్ విధానాల్లో బిడ్లను ఆహ్వానించారు. ఇందులో నలుగురు సీల్డ్ టెండర్లు వేయగా, బహిరంగ వేలంలో ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ అత్యధిక ధరను కోట్ చేసి హక్కులను సొంతం చేసుకుంది. ఈ ప్రక్రియ ద్వారా ఆలయ ఆదాయం గణనీయంగా పెరగడం పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఢిల్లీకి రక్ష.. సుదర్శన చక్ర



**శత్రువుల డ్రోన్లు, మిస్సైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం**

**రూ. 5,181 కోట్ల అంచనాతో సుదర్శన చక్రం**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ గగనతల భద్రతను మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఢిల్లీలోని అత్యంత సున్నితమైన వీఐపీ-89 జోన్ పరిధిలో గగనతల రక్షణను కట్టుదిట్టం చేసేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ గగనతల రక్షణ వ్యవస్థను 'సుదర్శన చక్ర - ఫర్ ఢిల్లీ' అనే ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశ రాజధాని చుట్టూ సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి గగనతల ముప్పు ఎదురైనా వెంటనే గుర్తించి, అడ్డుకునే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉంటుంది. డ్రోన్లు, మిసైళ్లు, శత్రు యుద్ధవిమానాల నుంచి వచ్చే ప్రమాదాలను ముందే గుర్తించి నిర్వీర్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను డీఆర్‌డీవో స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. దీని అంచనా వ్యయం సుమారు రూ.5,181 కోట్లుగా పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో డ్రోన్ల ద్వారా దాడులు, గగనతల ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో దేశ రాజధాని భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, భారత సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వశాఖ తాజాగా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోళ్లకు ఆమోదం తెలిపింది. ఈ పెద్ద ప్యాకేజీలో భాగంగానే ఢిల్లీకి సంబంధించిన ఈ గగనతల రక్షణ వ్యవస్థకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం. గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే ప్రధాని నరేంద్ర మోదీ 'సుదర్శన చక్ర' వ్యవస్థ గురించి ప్రస్తావించారు. దేశంలోని వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాలు, పౌర కేంద్రాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాలను గగనతల దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని అప్పుడే ప్రకటించారు. ఈ వ్యవస్థలో భాగంగా శత్రు క్షిపణులు, యుద్ధవిమానాలను గుర్తించే అధునాతన రాడార్ వ్యవస్థలు, వాటిని మధ్యలోనే కూల్చివేసే ఇంటర్‌సెప్టర్లు, అలాగే సైబర్ యుద్ధాన్ని ఎదుర్కొనే సామర్థ్యం కూడా ఉండనుంది. డీఆర్‌డీవో, ప్రైవేట్ రక్షణ సంస్థలు, భారత సైన్యం కలిసి ఈ భారీ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ఇప్పటికే ప్రాథమిక సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం. మొత్తంగా చూస్తే, ఢిల్లీ గగనతల భద్రతను ఇనుమడింపజేసే దిశగా సుదర్శన చక్ర ప్రాజెక్ట్ దేశ రక్షణ రంగంలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.


# రోడ్ నెట్‌వర్క్‌లో భారత్ నం.2

**1.46 లక్షల కిలోమీటర్లకు చేరిన జాతీయ రహదారులు**

**2014తో పోలిస్తే ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణంలో భారీ వృద్ధి**



న్యూఢిల్లీ: గత 11 ఏళ్లలో భారతదేశం మౌలిక సదుపాయాల కల్పనలో, ముఖ్యంగా జాతీయ రహదారుల విస్తరణలో సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల పొడవు 1,46,560 కిలోమీటర్లకు చేరడంతో, అమెరికా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 2014లో 91,287 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారులు, 2025 నాటికి ఏకంగా 61 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అగ్రరాజ్యం అమెరికా జాతీయ రహదారుల నెట్ వర్క్ విషయంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ముఖ్యంగా భారత్ మాల పరియోజన వంటి పథకాల ద్వారా భారత్ లో హైవేల రూపురేఖలు మారిపోయాయి. 2014లో కేవలం 93 కిలోమీటర్లుగా ఉన్న యాక్సెస్-కంట్రోల్డ్ హైస్పీడ్ కారిడార్లు, ఎక్స్‌ప్రెస్ వేలు ప్రస్తుతం 3,052 కిలోమీటర్లకు పెరిగాయి. అలాగే నాలుగు లేన్ల రహదారులు 18 వేల కిలోమీటర్ల నుంచి 43,512 కిలోమీటర్లకు రెట్టింపయ్యాయి. రాబోయే మూడేళ్లలో మరో రూ.8.3 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. సామాన్య ప్రజలకు ఊరటనిచ్చేలా భద్రతా ప్రమాణాల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రోడ్డు ప్రమాద బాధితులకు 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ స్కీమ్' ద్వారా రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాద సమయంలో సాయం చేసే వారికి (గుడ్ సమారిటన్) ఇచ్చే పారితోషికాన్ని రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. రవాణా రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు 2026 జనవరిలో పబ్లిక్ ఇన్విట్ ను తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. హైడ్రోజన్ ట్రక్కుల ప్రయోగాలు, ఫాస్టాగ్ ఆధారిత టోలింగ్ వంటి ఆధునిక సాంకేతికతతో భారత రవాణా రంగం కొత్త పుంతలు తొక్కుతోంది.



## ప్రియాంక గాంధీ కొడుకు నిశ్చితార్థం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఆమె కుమారుడు రైహాన్ వద్రా త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నారు. ఢిల్లీకి చెందిన తన స్నేహితురాలు అవివా బేగ్‌తో రైహాన్ నిశ్చితార్థం జరిగింది. వీరిద్దరూ గత ఏడేళ్లుగా ప్రేమలో ఉన్నారని, రెండు కుటుంబాల పెద్దల అంగీకారంతో వీరు ఒక్కటవుతున్నారని ఎన్డీటీవీ తన కథనంలో ధృవీకరించింది. ప్రస్తుతం గాంధీ, వద్రా, బేగ్ కుటుంబాలు రాజస్థాన్‌లోని రణథంబోర్‌లో ఉన్నాయి. అక్కడే నిశ్చితార్థ వేడుకలతో పాటు న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ జరుపుకుంటున్నట్లు సమాచారం. రైహాన్, అవివా కుటుంబాల మధ్య ఎప్పటి నుంచో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మూడు రోజుల క్రితం అవివా తన ఇన్‌స్టాగ్రామ్‌లో రైహాన్‌తో ఉన్న ఫోటోను షేర్ చేస్తూ హార్ట్ సింబల్స్ పెట్టడంతో వీరి బంధంపై స్పష్టత వచ్చింది. అవివా బేగ్ ఢిల్లీకి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్. ఆమె 'అటెలియర్ 11' అనే ఫోటోగ్రాఫిక్ స్టూడియోకి కో-ఫౌండర్‌గా వ్యవహరిస్తోంది. ఢిల్లీలోని మోడరన్ స్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె... ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో జర్నలిజం, కమ్యూనికేషన్ కోర్సు పూర్తిచేసింది. ఆమె తీసిన ఫోటోలు ఇండియా ఆర్ట్ ఫెయిర్ సహా పలు ప్రముఖ వేదికలపై ప్రదర్శితమయ్యాయి. కేవలం ఫోటోగ్రఫీ మాత్రమే కాకుండా మీడియా ప్రొడక్షన్, బ్రాండింగ్ రంగాల్లోనూ ఆమె పనిచేసింది.


# వారం వారం క్రెడిట్ స్కోర్ అప్డేట్

**పాన్-ఆధార్ లింక్ చేయకపోతే పలు సేవలకు బ్రేక్**

**పీఎం కిసాన్ కొత్త లబ్ధిదారులకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి**

**గ్యాస్ ధరలు, ఐటీ రిటర్నుల విధానంలోనూ మార్పులు**

**జనవరి 1 నుంచి అమలుకానున్న ఆర్థిక మార్పులివే**




న్యూఢిల్లీ: 2025 సంవత్సరం ముగిసి 2026 కొత్త సంవత్సరం ప్రారంభం కాబోతోంది. జనవరి 1 నుంచి సామాన్యుడి జేబుపై, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలపై, రైతుల సంక్షేమ పథకాలపై ప్రభావం చూపే అనేక కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. బ్యాంకింగ్, పన్ను విధానాలు, గ్యాస్ ధరలు వంటి అంశాల్లో వస్తున్న ఈ మార్పులను ప్రజలు గమనించాల్సి ఉంది. ప్రధానంగా పాన్-ఆధార్ అనుసంధానం అత్యంత కీలకం కానుంది. ఇప్పటికీ వీటిని లింక్ చేయని వారి బ్యాంక్ ఖాతాలు ఫ్రీజ్ అయ్యే ప్రమాదం ఉంది. బ్యాంకింగ్ సేవలు, పన్ను రిఫండ్లు నిలిచిపోకుండా ఉండాలంటే తక్షణం ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సిందే. ఇక, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్తగా, 2025 డిసెంబర్ 31తో 7వ వేతన సంఘం గడువు ముగియనుండటంతో జనవరి 1 నుంచి 8వ వేతన సంఘం సిఫార్సులు అమల్లోకి రానున్నాయి. దీనివల్ల ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. బ్యాంకింగ్ రంగంలో మరో ప్రధాన మార్పు క్రెడిట్ స్కోర్ అప్డేట్. ఇప్పటివరకు 15 రోజులకోసారి జరిగే ఈ ప్రక్రియ, ఇకపై ప్రతి వారం జరగనుంది. దీనివల్ల లోన్ రీపేమెంట్లలో ఏ చిన్న జాప్యం జరిగినా వెంటనే క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడుతుంది. పీఎం కిసాన్ పథకంలో కొత్తగా చేరే రైతులకు 'ఫార్మర్ ఐడీ' తప్పనిసరి చేశారు. జనవరి 1 నుంచి కొత్త దరఖాస్తుదారులు ఈ డిజిటల్ ఐడీ ద్వారానే రూ.6,000 సాయం పొందేందుకు అర్హత సాధిస్తారు. వీటితో పాటు 2026 జనవరి నుంచి వచ్చే కొత్త ఐటీఆర్ ఫారాల్లో బ్యాంకింగ్, ఖర్చుల వివరాలు ప్రీ-ఫిల్ అయి రానున్నాయి. అలాగే, ప్రతి నెల మొదటి తేదీన జరిగే ఎల్‌పీజీ, విమాన ఇంధన ధరల సవరణ కూడా జరగనుంది. డిజిటల్ మోసాలను అరికట్టేందుకు యూపీఐ లావాదేవీలు, సిమ్ వెరిఫికేషన్ నిబంధనలను మరింత కఠినతరం చేయనున్నారు. ఆర్బీఐ కొత్త నిబంధనల ప్రకారం కో-లెండింగ్ విధానంలోనూ మార్పులు రానున్నాయి.

# జీడీపీ కంటే.. ఇంట్లో బంగారమే ఎక్కువ!

**దేశ ప్రజల వద్ద వంద లక్షల కోట్ల బంగారం**

**భారతీయుల వద్ద 34,600 టన్నుల పసిడి**




న్యూఢిల్లీ: భారతీయులకు బంగారంపై ఉన్న మక్కువ మరో సంచలనానికి దారితీసింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో భారతీయ కుటుంబాల వద్ద ఉన్న బంగారం మొత్తం విలువ దేశ ఆర్థిక వ్యవస్థ (జీడీపీ) పరిమాణాన్ని మించిపోయింది. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో బంగారం ధర ఔన్సుకు 4,500 డాలర్లు దాటడంతో ఈ పరిస్థితి నెలకొంది. మోర్గాన్ స్టాన్లీ అంచనాల ప్రకారం.. భారతీయ ఇళ్లలో దాదాపు 34,600 టన్నుల బంగారం నిల్వ ఉంది. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం లెక్కగడితే.. భారతీయుల వద్ద ఉన్న ఈ బంగారం విలువ 5 లక్షల కోట్ల డాలర్ల కంటే ఎక్కువ. అంతర్జాతీయ ద్రవ్య నిధి అంచనాల ప్రకారం భారత జీడీపీ సుమారు 4.1 లక్షల కోట్ల డాలర్లుగా ఉంది. అంటే దేశం మొత్తం ఉత్పత్తి చేసే ఆదాయం కంటే ప్రజల ఇళ్లలో ఉన్న పసిడి విలువే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ అంశంపై ఇన్ఫోమెరిక్స్ వాల్యుయేషన్ అండ్ రేటింగ్స్ చీఫ్ ఎకనామిస్ట్ డాక్టర్ మనోరంజన్ శర్మ ఎకనామిక్ టైమ్స్‌తో మాట్లాడుతూ.. "జీడీపీ అనేది ఒక ప్రవాహం లాంటిది, బంగారం అనేది నిల్వ ఉండే ఆస్తి. ఈ రెండింటిని నేరుగా పోల్చలేం. కానీ, భారత ఆర్థిక వ్యవస్థలో బంగారానికి ఉన్న సామాజిక, ఆర్థిక, మానసిక ప్రాధాన్యతను ఈ గణాంకాలు స్పష్టంగా చూపిస్తున్నాయి" అని విశ్లేషించారు. బంగారం విలువ పెరగడం వల్ల గృహాల బ్యాలెన్స్ షీట్లు బలపడతాయని మోర్గాన్ స్టాన్లీ వంటి సంస్థలు చెబుతున్నప్పటికీ, దీనిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఎమ్కే గ్లోబల్ విశ్లేషణ ప్రకారం.. ఇళ్లలో ఉండే బంగారంలో దాదాపు 75 నుంచి 80 శాతం ఆభరణాల రూపంలోనే ఉంటుంది. భారతీయులు దీన్ని పొదుపుగా భావిస్తారు తప్ప, విక్రయించి సొమ్ము చేసుకునే ఆస్తిగా చూడరు. అందుకే ధరలు పెరిగినా వినియోగంపై పెద్దగా ప్రభావం ఉండదని నిపుణులు అంటున్నారు. కేవలం ప్రజలే కాదు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కూడా తన బంగారం నిల్వలను పెంచుకుంటోంది. 2024 నుంచి ఇప్పటివరకు ఆర్బీఐ సుమారు 75 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. దీంతో మొత్తం నిల్వలు 880 టన్నులకు చేరాయి. యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితి సమయాల్లో బంగారం సురక్షితమైన పెట్టుబడి కావడంతో కేంద్ర బ్యాంకులు కూడా దీని వైపు మొగ్గు చూపుతున్నాయి. అయితే ఆర్థిక పరంగా చూస్తే బంగారం ఒక ఉత్పాదకత లేని ఆస్తి అని, ప్రజలు ఈటీఎఫ్ వంటి బాండ్ల వైపు మళ్లాలని నిపుణులు సూచిస్తున్నా, భౌతిక బంగారంపై మోజు మాత్రం తగ్గడం లేదు.

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా కన్నుమూత

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధినేత్రి ఖలీదా జియా మృతి పట్ల ఆమె కుమారుడు, పార్టీ తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న 80 ఏళ్ల ఖలీదా జియా... ఢాకాలోని ఎవర్‌కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 6 గంటలకు తుదిశ్వాస విడిచారు. తల్లి మరణంపై స్పందిస్తూ తారిఖ్ రెహమాన్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఒక ఉద్వేగభరితమైన పోస్ట్ చేశారు. "నా తల్లి అల్లా పిలుపు మేరకు మనల్ని విడిచి వెళ్లిపోయారు. చాలా మందికి ఆమె 'ప్రజాస్వామ్య మాత' (మదర్ ఆఫ్ డెమోక్రసీ), రాజీపడని నాయకురాలు. కానీ, నాకు మాత్రం ఆమె దేశం కోసమే జీవితాన్ని అంకితం చేసిన ప్రేమగల అమ్మ" అని పేర్కొన్నారు. కష్టకాలంలోనూ ఆమె కుటుంబానికి అండగా నిలిచారని తారిఖ్ గుర్తుచేసుకున్నారు. దేశం కోసం తన భర్తను, బిడ్డను కోల్పోయినప్పటికీ... దేశ ప్రజలనే తన కుటుంబంగా భావించారని, ఆమె త్యాగాలు బంగ్లాదేశ్ ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని నివాళులర్పించారు. ఖలీదా జియా మృతికి సంతాపంగా బీఎన్‌పీ 7 రోజుల సంతాప దినాలను ప్రకటించగా, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం 3 రోజుల అధికారిక సంతాపం, బుధవారం సాధారణ సెలవు ప్రకటించింది. బుధవారం ఢాకాలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తారిఖ్ రెహమాన్ అధ్యక్షతన పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై సీనియర్ నేతలతో చర్చించారు.

## సల్మాన్ ఖాన్ సినిమాపై చైనా విమర్శలు


**కళాత్మక స్వేచ్ఛ ఉందని స్పష్టం చేసిన కేంద్రం**



న్యూఢిల్లీ: బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ నటిస్తున్న 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' సినిమాపై చైనా చేస్తున్న విమర్శలను భారత ప్రభుత్వం గట్టిగా తిప్పికొట్టింది. ఇది తమ దేశ కళాత్మక స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన విషయమని స్పష్టం చేసింది. సినిమా నిర్మాణంలో ప్రభుత్వానికి ఎలాంటి పాత్ర లేదని, దీనిపై అనవసర రాద్ధాంతం చేయొద్దని చైనాకు పరోక్షంగా సూచించింది. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన భీకర ఘర్షణల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇటీవల విడుదలైన ఈ చిత్ర టీజర్‌పై చైనా ప్రభుత్వ అధికారిక మీడియా 'గ్లోబల్ టైమ్స్' తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సినిమా వాస్తవాలను వక్రీకరిస్తోందని, చరిత్రను తప్పుగా చూపిస్తోందని, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ఉందని ఆరోపించింది. బాలీవుడ్ చిత్రాలు అతిశయోక్తులతో ఉంటాయని, వాస్తవాలను మార్చలేవని చైనా సైనిక నిపుణులు వ్యాఖ్యానించారు. చైనా విమర్శలపై భారత ప్రభుత్వ వర్గాలు మీడియా ద్వారా స్పందించాయి. ఎన్డీటీవీ కథనం ప్రకారం, "భారతదేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంది. సినిమా వ్యక్తీకరణ అందులో ఒక భాగం. ఈ కళాత్మక స్వేచ్ఛకు అనుగుణంగా చిత్రాలను రూపొందించుకునే హక్కు భారతీయ చిత్ర నిర్మాతలకు ఉంది" అని ఆ వర్గాలు స్పష్టం చేశాయి. సినిమా నిర్మాణంలో ప్రభుత్వ జోక్యం ఏమీ లేదని తేల్చి చెప్పాయి. "ఈ సినిమాపై ఆందోళన ఉన్నవారు స్పష్టత కోసం భారత రక్షణ మంత్రిత్వ శాఖను సంప్రదించవచ్చు. దీనిలో ప్రభుత్వానికి ఎలాంటి పాత్ర లేదు" అని కూడా ఆ వర్గాలు తెలిపాయి. 2020 జూన్ 15న తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత, చైనా సైనికుల మధ్య భీకర ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణల్లో 16వ బిహార్ రెజిమెంట్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బి. సంతోష్ బాబు సహా 20 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. ఈ వాస్తవ ఘటనల ఆధారంగా, పాత్రికేయులు శివ్ ఆరూర్, రాహుల్ సింగ్ రాసిన "ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ 3" పుస్తకంలోని ఒక అధ్యాయం ఆధారంగా 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' సినిమాను తెరకెక్కిస్తున్నారు. అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం 2026 ఏప్రిల్ 17న విడుదల కానుంది.

## రైలు పట్టాల వద్ద గాలిపటాలు ఎగరేయొద్దు


**ప్రజలకు దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి**



సికింద్రాబాద్, డిసెంబర్ 30 (ఈవార్తలు): సంక్రాంతి పండుగ సమీపిస్తుండటంతో గాలిపటాల కోలాహలం మొదలవుతోంది. అయితే పండుగ వేళ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా రైల్వే ట్రాక్‌లు, రైల్వే స్టేషన్లు, ఎలక్ట్రిక్ ట్రాక్షన్ లైన్ల సమీపంలో గాలిపటాలు ఎగురవేయవద్దని సూచించింది. రైల్వే లైన్ల మీదుగా వెళ్లే 25 వేల వోల్టుల హైటెన్షన్ వైర్లకు మాంజా తగిలితే ప్రాణాపాయం తప్పదని అధికారులు హెచ్చరించారు. గత సంక్రాంతి సీజన్‌లో రైల్వే ట్రాక్‌ల వద్ద పతంగులు ఎగురవేస్తూ పలువురు విద్యుత్ షాక్‌కు గురైన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. ముఖ్యంగా నిషేధిత చైనా మాంజాలో మెటాలిక్, రసాయన పదార్థాలు ఉండటం వల్ల అవి విద్యుత్ వాహకాలుగా పనిచేస్తాయని, ఇవి హైవోల్టేజీ వైర్లకు తగిలితే ఆ వ్యక్తికి షాక్ కొట్టడంతో పాటు రైల్వే సేవలకు కూడా అంతరాయం కలుగుతుందని వివరించారు. పండుగను బాధ్యతాయుతంగా జరుపుకోవాలని, రైల్వే ఆస్తుల వద్ద జాగ్రత్తగా ఉండాలని కోరారు. మరోవైపు హైదరాబాద్‌లో చైనా మాంజా కారణంగా అప్పుడే ప్రమాదాలు మొదలయ్యాయి. పాతబస్తీలోని షంషీర్‌గంజ్ ప్రాంతంలో జమీల్ అనే ఫుడ్ డెలివరీ బాయ్ బైక్‌పై వెళుతుండగా మెడకు చైనా మాంజా చుట్టుకుంది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయమవగా, ఆసుపత్రిలో 22 కుట్లు వేయాల్సి వచ్చింది. ఈ ఘటనపై స్పందించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. నిషేధిత చైనా మాంజా విక్రయించే వారి సమాచారం ఇచ్చిన వారికి రూ. 5,000 రివార్డ్ ఇస్తానని ప్రకటించారు. పోలీసులు కూడా నగరంలో తనిఖీలను ముమ్మరం చేశారు.

## పెళ్లి జోలికే వెళ్లను

**జెన్నిఫర్ లోపెజ్ హాట్ కామెంట్స్**



న్యూజెర్సీ: ప్రముఖ హాలీవుడ్ నటి, పాప్ సింగర్ జెన్నిఫర్ లోపెజ్ (56) ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై కీలక నిర్ణయం తీసుకున్నారు. తన మాజీ భర్త బెన్ అఫ్లెక్ (53) నుంచి విడిపోయిన తర్వాత ఆమె మరో రిలేషన్‌షిప్‌లో లేరని, ప్రస్తుతం పూర్తిగా సింగిల్ లైఫ్‌పైనే దృష్టి సారించారని తెలుస్తోంది. ఇప్పుడు ఆమె ప్రాధాన్యత కేవలం తన కెరీర్, పిల్లలేనని సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. 'పీపుల్' మ్యాగజైన్ కథనం ప్రకారం.. జెన్నిఫర్ లోపెజ్ ప్రస్తుతం ఎవరితోనూ డేటింగ్ చేయడం లేదు. మూడో భర్త మార్క్ ఆంథోనీతో కలిగిన కవల పిల్లలు 17 ఏళ్ల మాక్స్, ఎమ్మెల పెంపకం, తన వృత్తిపరమైన పనులతోనే ఆమె బిజీగా ఉన్నారు. ఆమె ప్రస్తుతం ఎంతో సంతోషంగా, సంతృప్తిగా ఉన్నారని సమాచారం. 2025 జనవరిలో బెన్ అఫ్లెక్‌తో జెన్నిఫర్ విడాకుల ప్రక్రియ పూర్తయింది. 2024 ఆగస్టు 20న ఆమె విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. 2022లో వీరిద్దరూ లాస్ వెగాస్, జార్జియాల్లో ఘనంగా వివాహం చేసుకున్నారు. అయితే రెండేళ్లకే మనస్పర్థల కారణంగా విడిపోయారు. గతంలో 'ఇంటర్వ్యూ' మ్యాగజైన్‌తో మాట్లాడిన జెన్నిఫర్.. తాను సింగిల్ లైఫ్‌ను ఆస్వాదించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. "గత 25, 30 ఏళ్లుగా వేర్వేరు సవాళ్లతో కూడిన బంధాల్లో ఉన్నాను. ఇప్పుడు ఎవరి కోసమో వెతకడం లేదు. స్వేచ్ఛగా ఉండాలనుకుంటున్నాను" అని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, తాను పాత పద్ధతులను ఇష్టపడతానని, డేటింగ్ యాప్స్ ఉపయోగించే ఆలోచన తనకు లేదని జెన్నిఫర్ స్పష్టం చేశారు. జెన్నిఫర్ లోపెజ్ కు గతంలో నాలుగు పెళ్లిళ్లు జరిగాయి. 1997లో ఓజాని నోవాను పెళ్లాడగా, ఆ బంధం ఏడాదికే విచ్ఛిన్నమైంది. 2001లో క్రిస్ జూడ్ ను వివాహం చేసుకున్నారు. అయితే ఈ జోడీ 2003లో విడిపోయింది. మూడో భర్త మార్క్ ఆంథోనీతో మాత్రమే జెన్నిఫర్ లోపెజ్ సుదీర్ఘకాలం వైవాహిక జీవితం గడిపారు. 2004లో వీరిద్దరూ వైవాహిక బంధంలోకి అడుగుపెట్టగా... 2014లో విడిపోయారు. ఆ తర్వాత బెన్ అఫ్లెక్ ను పెళ్లి చేసుకోగా, ఈ కాపురం మూడేళ్ల పాటు సాగి 2025లో విడాకులతో ముగిసింది.

## లయ్యారి చిత్రం



మన్నీ కౌర్



# మెగా విక్టరీ మాస్ సాంగ్ అదుర్స్

సంక్రాంతి బరిలో దిగుతున్న 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా నుంచి మ్యూజికల్ ప్రమోషన్స్ జోరు పెరిగాయి. ఇప్పటికే రిలీజైన 'మీసాల పిల్ల', 'శశిరేఖ' పాటలు క్లాస్, మెలోడీ ప్రియులను ఆకట్టుకోగా, ఇప్పుడు మాస్ ఆడియెన్స్ కోసం అసలైన ట్రీట్ వచ్చేసింది. సినిమాలోని స్పెషల్ పార్టీ నెంబర్ 'మెగా విక్టరీ మాస్' సాంగ్ లిరికల్ వీడియోను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. పేరుకు తగ్గట్టే ఇది పక్కా మాస్ సెలబ్రేషన్ సాంగ్ లా అనిపిస్తోంది. ఈ పాటలో ఉన్న అసలైన హైలెట్ మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ ఒకే ఫ్రేమ్ లో కనిపించడం. చాలా కాలం తర్వాత వీరిద్దరూ కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడమే కాకుండా, హుషారుగా స్టెప్పులేయడం ఫ్యాన్స్ కు కనుల పండుగగా ఉంది. సంక్రాంతి రేసులో వినోదమే ప్రధాన ఆయుధంగా వస్తున్న ఈ సినిమా జనవరి 12న థియేటర్లలోకి రానుంది. పాటలతో బజ్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అయిన చిత్ర యూనిట్, థియేటర్లో ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలి. ప్రస్తుతానికి అయితే ఈ 'మెగా విక్టరీ మాస్' పాట సోషల్ మీడియాలో రీల్స్ కి మంచి స్టఫ్ అయ్యేలా ఉంది.





## వింటర్ వెకేషన్‌లో రష్మిక

ప్రముఖ హీరోయిన్ రష్మిక మందన్న తాజాగా రోమ్ కి వెకేషన్ కి వెళ్ళినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈమె మైసా అనే సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా నుండి ఈమె ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేశారు. అయితే ఈ సినిమా షూటింగ్ కి కాస్త గ్యాప్ లభించడంతో ఏకంగా విజయ్ దేవరకొండ ఫ్యామిలీతో ఈమె రోమ్ నగరానికి వెకేషన్ కి వెళ్ళినట్లు తెలుస్తోంది. అలాగే అక్కడ తన స్నేహితులతో కలిసి సందడి చేసింది. ముఖ్యంగా ఇన్స్టాగ్రామ్ లో నిత్యం యాక్టివ్ గా ఉండే రష్మిక మందన్న తాజాగా రోమ్ నగరంలో సందడి చేస్తున్న వీడియోలను, ఫోటోలను తన ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. అక్కడ స్ట్రీట్ ఫుడ్ ను రుచి చూస్తూనే.. మరొకవైపు రోమ్ వీధుల్లో తిరుగుతూ తెగ ఎంజాయ్ చేస్తోంది. ఇకపోతే అక్కడి నుండి పంచుకున్న ఫోటోలు అభిమానులలో సరికొత్త అనుమానాలు క్రియేట్ చేస్తున్నాయి.

## టాలీవుడ్ వల్లే నా కెరీర్ మారింది



తెలుగులో సీతారామం సినిమాతో సూపర్ హిట్ అందుకున్న మృణాల్ ఠాకూర్‌కు మంచి పాపులారిటీ వచ్చింది. బాలీవుడ్ లో తనతో లవ్ స్టోరీస్ తీయలేదు తనని కేవలం గ్లామర్ గానే చూపించారని అప్పట్లో ఒక ఇంటర్వ్యూలో చెప్పిన మృణాల్ ఠాకూర్ మరోసారి తెలుగు పరిశ్రమ మీద తన అభిమానాన్ని చెప్పింది. తెలుగు సినిమాల వల్లే తనకు గుర్తింపు వచ్చిందని వాటి వల్లే తన కెరీర్ మారిపోయిందని అంటుంది. బాలీవుడ్ మేకర్స్ ఏమైనా అనుకుంటారన్న డౌట్ లు ఏమి లేకుండా టాలీవుడ్ మీద మృణాల్ చూపిస్తున్న ఈ ప్రేమకు తెలుగు ఆడియన్స్ కూడా ఫిదా అవుతున్నారు. ఎంతోమంది ముంబై భామలు తెలుగులో స్టార్ క్రేజ్ వచ్చినా కూడా తెలుగు సినిమాలను, టాలీవుడ్ ని చిన్నచూపు చూసిన సందర్భాలు ఉన్నాయి. వాళ్ల కెరీర్ లో హిట్ సినిమాలు తెలుగులో ఉన్నా కూడా వాటిని వదిలేసి మిగతా భాషల్లో యావరేజ్ సినిమాల గురించి డిస్కషన్స్ పెట్టే వాళ్లు ఉన్నారు. కానీ వాళ్లందరికీ షాక్ ఇస్తూ మృణాల్ తెలుగు పరిశ్రమ మీద చేస్తున్న కామెంట్స్ తెలుగు ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తున్నాయి.

## సన్నీ లియోన్ షో క్యాన్సిల్

సన్నీలియోన్‌తో న్యూ ఇయర్ పార్టీలను ఏర్పాటు చేసేందుకు పెద్ద ఎత్తున సంస్థలు ముందుకు వస్తూ ఉంటాయి. ఈసారి ఈమె న్యూ ఇయర్ పార్టీ మధురలో ప్లాన్ చేశారు. భారీ ఎత్తున ఈమెకు పారితోషికం ఇచ్చి మరీ ఒక హోటల్ యాజమాన్యం ఈమెను హైర్ చేసుకుంది. కేవలం 300 మంది ఆడియన్స్‌తో ఈ పార్టీని ఏర్పాటు చేసేందుకు రెడీ అయింది. అకస్మాత్తుగా సన్నీ లియోన్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లుగా హోటల్ యాజమాన్యం ప్రకటించింది. అంతే కాకుండా ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న వారికి రిఫండ్ ఇవ్వనున్నట్లుగా తెలుస్తోంది. మధురలో సన్నీ లియోన్ కార్యక్రమంను రద్దు చేయడం వెనుక సాధువులు ఉన్నారని, పెద్ద ఎత్తున హిందూ సంఘాలు ఆందోళన చేపట్టినట్లు తెలుస్తోంది. సన్నీ లియోన్ వంటి శృంగార తార తో హిందువులు పవిత్రంగా భావించే మధురలో డాన్స్ కార్యక్రమం చేయించడం ఏమాత్రం కరెక్ట్ కాదని హిందూ సంఘాల వారు అంటున్నారు. పలువురు సాధువులు, హిందూ సంఘాల నాయకులు స్థానిక కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాదు కూడదు అంటే.. జరిగే పరిణామాలకు తమను బాధ్యులను చేయొద్దు అంటూ హెచ్చరించడంతో వెనక్కి తగ్గినట్లు తెలిసింది.






## లేటైంది.. బడ్జెట్ 100 కోట్లు పెరిగింది!

బాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో లవ్ అండ్ వార్ ఒకటి. రణబీర్ కపూర్, విక్కీ కౌశల్ హీరోలుగా నటిస్తున్న ఈ సినిమాలో ఆలియా భట్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. ఈ భారీ బాలీవుడ్ మల్టీస్టారర్ మూవీకి బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ గత ఏడాది చివర్లో ప్రారంభం అయింది. ఆ సమయంలోనే సినిమాను 2025 చివరి వరకు విడుదల చేస్తామని మేకర్స్ చెప్పుకొచ్చారు. ఆ తర్వాత సినిమాను 2026 ఈద్ కి విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు మేకింగ్ విషయంలో ఒక కొలిక్కి రాని కారణంగా సినిమాను వాయిదా వేయడం జరిగింది. నిన్న మొన్నటి వరకు సినిమాను 2026 మే లో విడుదల చేస్తారనే వార్తలు వచ్చాయి. కానీ తాజాగా బాలీవుడ్ వర్గాల నుంచి అందుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం సినిమా మరో మూడు నెలలు ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. మొదట ఈ

# 2026లో ఆటలే ఆటలు

## ఐసీసీ టీ20 ప్రపంచ కప్ మొదలు..

### ఫిఫా వరల్డ్ కప్ దాకా.. అభిమానులకు పండగే

**క్రీడాభిమానులకు నూతన సంవత్సరం 2026 ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ నుంచి ప్రపంచం మెచ్చే ఫిఫా వరల్డ్ కప్ వరకు ఎన్నో ప్రతిష్టాత్మక టోర్నీలకు 2026 వేదికగా నిలవనుంది. వింటర్ ఒలింపిక్స్‌తో పాటు కామన్వెల్త్ గేమ్స్ కూడా 2026లోనే సందడి చేయనున్నాయి. మరికొద్దీ గంటల్లో యావత్ ప్రపంచం కొత్త సంవత్సరానికి స్వాగతం పలకనుంది. పలు ప్రపంచకప్ టోర్నీల నేపథ్యంలో 2026ను అభిమానులు ప్రపంచకప్ నామ సంవత్సరంగా గుర్తు పెట్టుకోనున్నారు.**

## 2026 క్రీడా క్యాలెండర్:

**1.జనవరి: మెల్‌బోర్న్ కోర్టులో టెన్నిస్ సందడి**

ఆస్ట్రేలియన్ ఓపెన్: జనవరి మధ్య నుంచి ఫిబ్రవరి ఆరంభం వరకు (మెల్‌బోర్న్).
ఐసీసీ అండర్–19 పురుషుల వరల్డ్ కప్: జనవరి 15 – ఫిబ్రవరి 6 (జింబాబ్వే, నమీబియా).





**2. ఫిబ్రవరి: మంచు కొండల్లో ఒలింపిక్స్.. భారత గడ్డపై వరల్డ్ కప్**

వింటర్ ఒలింపిక్స్: ఫిబ్రవరి 6 – 22 (మిలన్–కోర్టినా, ఇటలీ).
ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్: ఫిబ్రవరి 7 – మార్చి 8 (భారత్, శ్రీలంక సంయుక్తంగా).
సూపర్ బౌల్ ఎల్ఎక్స్: ఫిబ్రవరి 8.



**3. మార్చి: మోదీ స్టేడియంలో ప్రపంచ కప్ ఫైనల్..**

ఐపీఎల్ హంగామా షురూ..
టీ20 వరల్డ్ కప్ ఫైనల్: మార్చి 8 (అహ్మదాబాద్).
ఎఫ్1 సీజన్ ప్రారంభం: మార్చి 8 (ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రి).
వరల్డ్ బేస్ బాల్ క్లాసిక్: మార్చి 5 – 17.
చెస్ కాండిడేట్స్ టోర్నమెంట్: మార్చి 28 – ఏప్రిల్ 16 (సైప్రస్).
ఐపీఎల్: మార్చి నెలాఖరు నుంచి మే నెలాఖరు వరకు.

**4.ఏప్రిల్, మే: గోల్ఫ్, ఫ్రెంచ్ ఓపెన్**

ది మాస్టర్స్ (గోల్ఫ్): ఏప్రిల్ 9 – 12.
ఫ్రెంచ్ ఓపెన్ (టెన్నిస్): మే నెలాఖరు – జూన్ ప్రారంభం (పారిస్).
ఐపీఎల్ ఫైనల్: మే చివర్లో.
యూఈఎఫ్ఏ ఛాంపియన్స్ లీగ్ ఫైనల్: మే 30 (బుడాపెస్ట్).



**5. జూన్, జూలై: ఫుట్‌బాల్ ప్రపంచకప్**

ఫిఫా వరల్డ్ కప్: జూన్ 11 – జూలై 19. చరిత్రలో తొలిసారిగా 48 జట్లతో (అమెరికా, కెనడా, మెక్సికో వేదికలుగా).
మహిళల టీ20 వరల్డ్ కప్: జూన్ 12 – జూలై 5 (ఇంగ్లాండ్).
వింబుల్డన్: జూన్ నెలాఖరు – జూలై మధ్య వరకు (లండన్).
కామన్వెల్త్ గేమ్స్: జూలై 23 – ఆగస్టు 2 (గ్లాస్గో, స్కాట్లాండ్).
టూర్ డి ఫ్రాన్స్ (సైక్లింగ్): జూలై 4 – 26.

**6.ఆగస్టు: హాకీ, బ్యాడ్మింటన్ సమరం**

ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్: ఆగస్టు 14 – 30 (నెదర్లాండ్స్, బెల్జియం).
బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ (బ్యాడ్మింటన్): ఆగస్టు నెలాఖరు (న్యూఢిల్లీ).
యుఎస్ ఓపెన్ (టెన్నిస్): ఆగస్టు నెలాఖరు – సెప్టెంబర్ ప్రారంభం (న్యూయార్క్).

**7. సెప్టెంబర్: ఆసియా క్రీడల నగారా**

ఆసియా క్రీడలు: సెప్టెంబర్ 19 – అక్టోబర్ 4 (ఐచి–నాగోయా, జపాన్).
డైమండ్ లీగ్ ఫైనల్స్ (అథ్లెటిక్స్): సెప్టెంబర్ 4 – 5 (బ్రస్సెల్స్).
ఎఫ్ఐబీఏ మహిళల బాస్కెట్‌బాల్ వరల్డ్ కప్: సెప్టెంబర్ 4 – 13 (బెర్లిన్).

**8. నవంబర్, డిసెంబర్: ముగింపు వేడుకలు**

డబ్ల్యూటీఏ,ఏటీపీ ఫైనల్స్ (టెన్నిస్): నవంబర్ మధ్యలో (సౌదీ అరేబియా).
ఎఫ్1 సీజన్ ముగింపు: డిసెంబర్ 4 – 6 (అబుదాబి).
బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్: డిసెంబర్ 9 – 13 (చైనా).
ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ 2026: (తేదీలు, వేదిక ఖరారు కావాల్సి ఉంది).






# టీ20 సిరీస్ క్వీన్ స్వీప్

## అదరగొట్టిన అమ్మాయిలు.. శ్రీలంకపై జయకేతనం.. 2025కు ఘన వీడ్కోలు

**మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచి 2025ను చిరస్మరణీయం చేసుకున్న మహిళల జట్టు.. ఈ ఏడాదిని ఘనంగా ముగించింది. శ్రీలంకతో ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ 5–0తో క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం జరిగిన చివరి టీ20లో హర్మన్‌ప్రీత్ సేన.. 15 పరుగుల తేడాతో విజయం సాధించింది.**

**టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఈ లక్ష్యఛేదనలో శ్రీలంక 20 ఓవర్లలో 160/7కు పరిమితమైంది. ఓపెనర్ హాసిని పెరీరా (65బీ 42 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్), వన్‌డౌన్ బ్యాటర్ ఇమేషా దులానీ (50బీ 39 బంతుల్లో 8 ఫోర్లు) అర్ధ శతకాలు చేశారు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోరుకే వెనుదిరిగారు.**

భారత బౌలర్లలో దీప్తి శర్మ, అరుంధతి రెడ్డి, వైష్ణవి శర్మ, అమన్‌జ్యోత్ కౌర్, శ్రీచరణి, స్నేహ్ రాణా తలో వికెట్ పడగొట్టారు. భారత బ్యాటర్లలో హర్మన్‌ప్రీత్ కౌర్ (68బీ 43 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అలరించింది. చివర్లో అరుంధతి రెడ్డి (27బీ 11 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు మెరిపించింది. అమన్‌జ్యోత్ (21బీ 18 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించింది. జి.కమలిని (12), షెఫాలి వర్మ (5), రిచా ఘోష్ (5), దీప్తి శర్మ (7) నిరాశపర్చారు. ఒక దశలో భారత్ 77 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో అమన్‌జ్యోత్‌తో కలిసి హర్మన్ ప్రీత్ ఆరో వికెట్‌కు 37 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. శ్రీలంక బౌలర్లలో చమరి ఆటపట్టు, రష్మిక, కవిషా దిల్హరి రెండేసి వికెట్లు పడగొట్టగా.. నిమాషా మదుశనికి ఒక వికెట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ఒక వికెట్ పడగొట్టిన ఆల్‌రౌండర్ దీప్తి శర్మ టీ20ల్లో కొత్త రికార్డు సృష్టించింది. ఆస్ట్రేలియా బౌలర్ మేగాన్ షట్ (151)ని అధిగమించి మహిళల టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచింది.






## రోకోను తప్పించారు

ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే ఆడుతున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. 2024 టీ20 ప్రపంచకప్ అనంతరం టీ20 అంతర్జాతీయ క్రికెట్ నుంచి కూడా రిటైర్ అయ్యారు. ఈ నేపథ్యంలో మే నెలలో టెస్ట్ క్రికెట్‌కు ఈ స్టార్ జోడీ ఆకస్మికంగా వీడ్కోలు పలకడం యావత్ క్రికెట్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. వీరి నిర్ణయంపై మాజీ భారత క్రికెటర్ రాబిన్ ఉతప్ప తీవ్ర సందేహాలు వ్యక్తం చేయడంతో పాటు, అది సహజమైనది కాదని, నిర్బంధం వల్ల తీసుకున్నదని అభిప్రాయపడ్డారు. తన యూట్యూబ్ ఛానెల్‌లో ఉతప్ప మాట్లాడుతూ, "ఇది బలవంతంగా చేసిన లొంగుబాటో కాదో నాకు తెలియదు. కానీ ఇది అస్సలు సహజమైన వీడ్కోలులా అనిపించడం లేదు. నిజం ఏమిటో వారు ఇద్దరూ తమ సమయం వచ్చినప్పుడు చెబుతారు అని నేను అనుకుంటున్నాను" అని స్పష్టం చేశారు.

## ఆర్సీబీకి ఎల్లిస్ పెర్రీ షాక్

వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) 2026 సీజన్ ప్రారంభానికి ముందే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కు బిగ్ షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ ప్లేయర్, ఆసీస్ ఆల్‌రౌండర్ ఎల్లిస్ పెర్రీ డబ్ల్యూపీఎల్ 2026 సీజన్ నుంచి తప్పుకుంది. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. డబ్ల్యూపీఎల్ 2024లో ఆర్‌సీబీ విజేతగా నిలవడంలో ఎల్లిస్ పెర్రీ కీలక పాత్ర పోషించింది. ఆమె గైర్హాజరీతో జట్టు బలహీన పడనుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే పెర్రీ స్థానంలో ఆర్‌సీబీ సయాలీ సత్ఘరేను తీసుకుంది. రూ.30 లక్షల కనీస ధరకే ఆమెను జట్టులోకి తెచ్చుకుంది. ఎల్లిస్ పెర్రీ గత కొంత కాలంగా గాయాలతో బాధపడుతుంది. ముఖ్యంగా ఆమె చీలమండ గాయం తిరగబెట్టినట్లు తెలుస్తోంది. కొన్నాళ్లు ఆటకు బ్రేక్ ఇచ్చి విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించడంతోనే ఎల్లిస్ పెర్రీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.




## ఇంగ్లండ్ టీ20 ప్రపంచకప్ జట్టు ఇదే!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 బరిలోకి దిగే ఇంగ్లండ్ జట్టు ఆ దేశ క్రికెట్ బోర్డు(ఈసీబీ) ప్రకటించింది. హ్యారీ బ్రూక్ సారథ్యంలోని 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను మంగళవారం వెల్లడించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్ స్టోన్‌కు ఈ జట్టులో చోటు దక్కలేదు. ఐపీఎల్ 2026 మినీ వేలంలో లివింగ్‌స్టోన్‌ను సన్‌రైజర్స్.. రూ.13 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. టీ20 ప్రపంచకప్ 2026 జట్టుతో పాటు శ్రీలంకలో పర్యటించే టీ20, వన్డే జట్లను కూడా ఈసీబీ ప్రకటించింది. యాషెస్ మూడో టెస్ట్‌లో గాయపడిన జోఫ్రా ఆర్చర్ టీ20 ప్రపంచకప్ 2026 జట్టులో చోటు దక్కించుకున్నాడు. యాషెస్ సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన జోష్ టంగ్‌కు రివార్డ్ దక్కింది. గతంలో ఒక్క వైట్ బాల్ మ్యాచ్ కూడా ఆడని జోష్ టంగ్‌కు ప్రపంచకప్ జట్టులో చోటు లభించింది.

**ఇంగ్లండ్ జట్టు:**


హ్యారీ బ్రూక్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్ (టీ20 ప్రపంచ కప్‌కు మాత్రమే), టామ్ బాంటన్, జాకబ్ బెథెల్, జోస్ బట్లర్, బ్రైడన్ కార్స్ (శ్రీలంక పర్యటనకు మాత్రమే), సామ్ కరన్, లియామ్ డాసన్, బెన్ డకెట్, విల్ జాక్స్, జేమీ ఓవర్‌టన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, జోష్ టంగ్, ల్యూక్ వుడ్.



## కార్ల్‌సన్ మళ్లీ తప్పుచేశాడు!

చెస్ చాంపియన్ మ్యాగ్నస్ కార్ల్‌సన్ మళ్లీ తన సహనాన్ని కోల్పోయారు. వరల్డ్ ర్యాపిడ్ చెస్, వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్ అయిన కార్ల్‌సన్.. తాజాగా దోహాలో జరుగుతున్న ఫిడే వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో ఓటమిని తట్టుకోలేక ఆవేశానికి గురయ్యాడు. టేబుల్‌ను అతను బలంగా కొట్టాడు. భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగయిసి చేతిలో ఓడిన నార్వే చెస్ గ్రాండ్‌మాస్టర్ మ్యాగ్నస్ కోపంతో క్వీన్ పావును పడేశాడు. గ్రాండ్‌మాస్టర్ అర్జున్ తన టెక్నిక్‌తో చాంపియన్ ప్లేయర్ కార్ల్‌సన్‌కు షాక్ ఇవ్వడంతో అతను టెంపర్ కోల్పోయాడు. జూన్ నెలలో కూడా ఇలాగే మ్యాగ్నస్ తన సహనాన్ని కోల్పోయిన విషయం తెలిసిందే. నార్వే చెస్ టోర్నీలో వరల్డ్ చాంపియన్ డీ గుకేశ్ చేతిలో ఓడిన తర్వాత అతను ఆవేశాన్ని ఆపుకోలేకపోయాడు. దోహాలో జరిగిన కార్ల్‌సన్ ఘటనకు చెందిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతున్నది. భారతీయ ప్లేయర్ అర్జున్ తన దూకుడు స్టయిల్ ఆటతో ఇప్పటికే 8 విక్టరీలు నమోదు చేశాడు. రెండు మ్యాచ్‌లు డ్రా అవ్వగా, ఒక దాంట్లో ఓడిపోయాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
బుధవారం 31-12-2025



# క్షణికానందం..
## జీవితాంతం విషాదం

క్యాలెండర్ మారుతోంది. మరో ఏడాది జ్ఞాపకాల దొంతరల్లోకి జారిపోతుంటే, కొత్త ఆశలతో సరికొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రపంచమంతా సిద్ధమవుతోంది. డిసెంబర్ 31వ తేదీ రాత్రి అంటేనే ఒక ఉద్వేగం, ఒక వేడుక. కానీ, దురదృష్టవశాత్తూ ఈ వేడుకల నిర్వచనం ఇటీవలి కాలంలో అపమార్గం పడుతోంది. 'ఆనందం' అంటే మద్యం మత్తులో ఊగడమని, 'జోష్' అంటే డ్రగ్స్ లోకంలో విహరించడమని కొందరు యువతీ యువకులు భ్రమపడుతున్నారు. ఒక్క రోజు వినోదం కోసం చేసే తప్పులు, జీవితాంతం కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయని గ్రహించలేకపోతున్నారు. నేటి ఆధునిక కాలంలో డిసెంబర్ 31 వేడుకలు అంటేనే డ్రగ్స్ పార్టీలు, అర్ధరాత్రి రేవ్ పార్టీలు అనే సంస్కృతి పెరిగిపోతోంది. ఒకప్పుడు మెట్రో నగరాలకే పరిమితమైన ఈ గాలి, ఇప్పుడు పట్టణాలు, పల్లెలకు కూడా పాకింది. గంజాయి నుండి మొదలుకొని కొకైన్, ఎల్ఎస్‌డీ, ఎండీఎంఏ వంటి సింథటిక్ డ్రగ్స్ వరకు విచ్చలవిడిగా సరఫరా అవుతున్నాయి. "ఒక్కసారే కదా.. ట్రై చేస్తే ఏమవుతుంది?" అనే చిన్న కుతూహలమే మత్తు ఊబిలోకి మొదటి అడుగు. ఆ ఒక్క రాత్రి కిక్కు కోసం చేసే ప్రయత్నం, జీవిత కాలం బానిసలుగా మార్చేస్తోంది. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల మెదడు మొద్దుబారిపోవడమే కాకుండా, గుండెపోటు, మానసిక వైకల్యం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

నూతన సంవత్సర వేడుకల సమయంలో మద్యం విక్రయాలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రతి ఏటా డిసెంబర్ 31 రాత్రి వందలాది కుటుంబాల్లో చీకటి నిండుతోంది. అతి వేగం, మద్యం మత్తులో నియంత్రణ కోల్పోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు లేదా శాశ్వత వికలాంగులుగా మారుతున్నారు. మీరు తాగే ఒక్క పెగ్గు మీ ప్రాణానికే కాదు, రోడ్డుపై వెళ్లే అమాయకుల ప్రాణాలకు కూడా ముప్పే అని మరువరాదు. మత్తులో విచక్షణ కోల్పోవడం వల్ల మహిళలపై వేధింపులు, ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయి. ఆ క్షణంలో కలిగే ఆవేశం లేదా ఆనందం కోసం చేసే పనులు నేర చరిత్రకు దారితీస్తున్నాయి. ఒక కేసు నమోదైతే ఆ యువకుడి భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలు, సామాజిక గౌరవం అన్నీ మంటగలిసిపోతాయి. తమ బిడ్డలు ప్రయోజకులు అవుతారని ఆశపడే తల్లిదండ్రులకు ఈ వార్తలు తీరని శోకాన్ని మిగిలిస్తున్నాయి. వేడుకల పేరుతో బయటకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. వారు ఎక్కడికి వెళ్తున్నారు? ఎవరితో గడుపుతున్నారు? అనే విషయాలను గమనించాలి. స్వేచ్ఛ ఇవ్వడం తప్పు కాదు, కానీ ఆ స్వేచ్ఛ స్వైరవిహారంగా మారకుండా చూసుకోవడం కన్నవారి బాధ్యత. పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూనే, డ్రగ్స్ మరియు మద్యం వల్ల కలిగే అనర్థాలను వివరించాలి.

ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం ఎన్ని ఆంక్షలు విధించినా, ఎన్ని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేసినా.. వ్యక్తిగత క్రమశిక్షణ లేనిదే మార్పు సాధ్యం కాదు. క్లబ్బులు, పబ్‌లు కేవలం లాభార్జనే ధ్యేయంగా కాకుండా, సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. యువత తమ శక్తిని నిర్మాణాత్మక పనుల కోసం ఉపయోగించాలి. కొత్త ఏడాది అంటే కొత్త లక్ష్యాలను నిర్దేశించుకోవాల్సిన సమయం. గతాన్ని సమీక్షించుకుని, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన శుభతరుణం. అటువంటి సందర్భాన్ని మత్తులో మునిగి తగలబెట్టుకోవడం విజ్ఞత అనిపించుకోదు. ఒక్క రాత్రి ఆనందం కోసం జీవితాన్ని పణంగా పెట్టకండి. మద్యం, డ్రగ్స్ లేని వేడుకలు కూడా ఎంతో ఉల్లాసాన్ని ఇస్తాయి. కుటుంబ సభ్యులతో, ఆత్మీయులతో కలిసి ఆరోగ్యకరమైన వాతావరణంలో కొత్త ఏడాదికి స్వాగతం పలుకుదాం.

– ఈవార్తలు సంపాదకీయ విభాగం

# లట్టు పొట్టు తింటున్నాం!

ప్రజల ఆహారపు అలవాట్లు భారతదేశ జీవక్రియాత్మక ఆరోగ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి ఆహార అధ్యయనాలు, నేటి భారతీయులు తీసుకుంటున్న ఆహారం మధుమేహం, ఊబకాయం, ముందస్తు మధుమేహం వంటి సమస్యలతో ఎలా ముడిపడి ఉందో స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ప్రతినిధిత్వం కలిగిన విస్తృత సమాచారాన్ని ఆధారంగా చేసుకున్న ఈ పరిశోధనలు, క్యాలరీల వినియోగం సరిపడినప్పటికీ పోషక ఘటకాల సమతుల్యత తీవ్రంగా లోపిస్తున్నదని సూచిస్తున్నాయి.భారతీయుల ఆహారం ఇప్పటికీ ప్రధానంగా కార్బోహైడ్రేట్లపై ఆధారపడి ఉంది. రోజువారీ శక్తిలో రెండు మూడొంతులు కార్బోహైడ్రేట్ల నుంచే వస్తున్నాయి. తెల్ల బియ్యం, శుద్ధి చేసిన గోధుమ పిండి, మెరిపించిన ధాన్యాలు అధిక గ్లైసెమిక్ స్థాయి కలిగి ఉండటంతో రక్తంలో చక్కెరను వేగంగా పెంచుతాయి. తక్షణ శక్తిని ఇచ్చినా, దీర్ఘకాలిక జీవక్రియాత్మక రక్షణను అందించలేవు. ఫలితంగా రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పదే పదే పెరుగుతూనే ఉంటాయి.

భారతీయుల ఆహారంలో మరో ప్రధాన లోపం ప్రోటీన్ కొరత. ఎక్కువగా ధాన్యాలు, పప్పుల నుంచే ప్రోటీన్ అందుతోంది. ఇవి సంపూర్ణ ప్రోటీన్ వనరులు కావు. గుడ్లు, పాలు, చేపలు, మాంసం వంటి అధిక నాణ్యత గల ప్రోటీన్ వనరుల వినియోగం ప్రాంతాల మధ్య, ఆదాయ స్థాయిల మధ్య చాలా తక్కువగా ఉంది. ఈ ప్రోటీన్ లోపం వల్ల భోజనం తర్వాత తృప్తి తగ్గి, రోజులో తరువాతి సమయంలో మరింత కార్బోహైడ్రేట్ తీసుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది క్రమంగా ఇన్సులిన్ నిరోధకతను పెంచుతోంది. కొవ్వుల వినియోగంలోనూ అసమతుల్యత స్పష్టంగా కనిపిస్తోంది. చాలా రాష్ట్రాల్లో సాచ్యురేటెడ్ కొవ్వుల వినియోగం అధికంగా ఉండగా, రక్షణాత్మక కొవ్వుల వినియోగం పరిమితంగా ఉంది. ఆహార ఆధునీకరణతో కొవ్వుల పరిమాణం పెరిగినా, వాటి నాణ్యత మాత్రం మెరుగుపడలేదు. ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు, మోనో అన్‌సాచ్యురేటెడ్ కొవ్వుల వినియోగం తక్కువగా ఉండటం దీర్ఘకాలిక ఆరోగ్య ప్రమాదాలకు దారి తీస్తోంది.

మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. 2010లో సుమారు 10%గా ఉన్న ఈ వర్గం, 2020 నాటికి 20–22%కు పెరిగింది. అంటే ప్రతి ఐదుగురిలో ఒకరు రాబోయే 5–7 సంవత్సరాల్లో మధుమేహానికి గురయ్యే ప్రమాదంలో ఉన్నారు. ఊబకాయం కూడా నెమ్మదిగా కానీ నిరంతరంగా పెరుగుతోంది. 2000లో స్థూలకాయం ప్రాబల్యం 3% కన్నా తక్కువగా ఉండగా, 2015 నాటికి ఇది 6.2%కు చేరింది. 2022 నాటికి 9–10% స్థాయికి పెరిగింది. ముఖ్యంగా కడుపు చుట్టూ కొవ్వు 2005లో 18%గా ఉండగా, 2020 నాటికి 35%ను దాటింది. ఇది నేరుగా అధిక కార్బోహైడ్రేట్ ఆహారం, చక్కెర వినియోగంతో అనుసంధానమై ఉంది.

చక్కెర వినియోగంలో దాచిన పెరుగుదల మరో పెద్ద ప్రమాదంగా మారింది. 1990లలో రోజువారీ చక్కెర వినియోగం సగటున 20–25 గ్రాములుగా ఉండేది. 2010 నాటికి ఇది 35 గ్రాములకు పెరిగింది. 2020 తర్వాత అనేక రాష్ట్రాల్లో ఇది 45–50 గ్రాముల వరకు చేరింది. ఇది రోజువారీ శక్తిలో సుమారు 7–9%కు సమానం,



ఆహార మార్పుల కాలక్రమ ప్రభావం గణాంకాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. 1990 నుండి 2020 మధ్య కాలంలో భారతీయుల ఆహార నిర్మాణంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. నేషనల్ న్యూట్రిషన్ మానిటరింగ్ బ్యూరో మరియు ఐసీఎంఆర్ డేటా ప్రకారం, 1990లో సగటు భారతీయుడి రోజువారీ క్యాలరీలలో కార్బోహైడ్రేట్ల వాటా సుమారు 70% ఉండేది. 2005 నాటికి ఇది 67%కి, 2020 నాటికి 62–65% స్థాయికి తగ్గినప్పటికీ, ఇంకా సురక్షిత పరిమితులను మించిందే. అదే కాలంలో ప్రోటీన్ వినియోగంలో ఆశించిన పెరుగుదల కనిపించలేదు. 1998లో మొత్తం శక్తిలో ప్రోటీన్ వాటా సగటున 11.5%గా ఉండగా, 2010లో అది 11.8%కి మాత్రమే పెరిగింది. 2020 నాటికీ ఇది 12%ని దాటలేకపోయింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించే 15–20% స్థాయికి భారతీయుల ఆహారం ఇంకా దూరంగానే ఉంది.

**కొవ్వుల వినియోగం విషయానికి వస్తే, 1990లో మొత్తం క్యాలరీలలో కొవ్వుల వాటా 18–20% మాత్రమే ఉండేది. పట్టణీకరణ వేగవంతమైన తర్వాత 2010 నాటికి ఇది 25%కి చేరింది. 2020–22 మధ్య కాలంలో కొన్ని పట్టణ ప్రాంతాల్లో ఇది 30%కు చేరినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా 22–24% వద్దే ఉంది. సమస్య కొవ్వుల పరిమాణంలో కాకుండా వాటి నాణ్యతలోనే ఎక్కువగా ఉంది.**

భారతదేశంలో మధుమేహం–ఆహారం మధ్య సంబంధం మరింత బలపడుతోంది. 1990లో మధుమేహం వ్యాప్తి సుమారు 2.8%గా ఉండగా, 2010 నాటికి ఇది 7.1%కి చేరింది. 2023 నాటికి దేశవ్యాప్తంగా సగటు 11–13%కు పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో ఈ శాతం 15%ను కూడా మించుతోంది. దీనికి ప్రధాన కారణంగా అధిక కార్బోహైడ్రేట్ వినియోగం, తక్కువ ప్రోటీన్, అధిక గ్లైసెమిక్ లోడ్ ఉన్న ఆహారం గుర్తించబడుతోంది. ముందస్తు మధుమేహం కేసులు

ఇది సిఫార్సు చేసిన 5% పరిమితిని గణనీయంగా మించిందే. తీపి పానీయాల వినియోగం 2000 నుంచి 2020 మధ్య కాలంలో దాదాపు రెండున్నర రెట్లు పెరిగింది. ఈ పరిస్థితుల్లో నిజంగా పనిచేసే పరిష్కారం ఏమిటంటే, మొత్తం కార్బోహైడ్రేట్ మోతాదును తగ్గించి, అందులో కనీసం 5% శక్తిని ప్రోటీన్‌తో భర్తీ చేయడం. ఈ చిన్న మార్పు మధుమేహ ప్రమాదాన్ని 8–10% వరకు, ఊబకాయం ప్రమాదాన్ని 6–7% వరకు తగ్గించినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. 2025 నుంచి 2035 మధ్య కాలాన్ని ఆహార సంస్కరణ దశగా భావిస్తే, భారతదేశం జీవక్రియాత్మక వ్యాధుల భారాన్ని 15–20% వరకు తగ్గించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. దీనికి ఆహార పళ్లెంలో సమతుల్యత, పరిమాణ నియంత్రణ, ప్రోటీన్ ప్రాధాన్యం అత్యవసరం. ఆహార మార్పు వ్యక్తిగత ఎంపిక మాత్రమే కాదుబీ ఇది దేశ ఆరోగ్య భవిష్యత్తును నిర్ణయించే సామూహిక బాధ్యతగా మారుతోంది.

భారతదేశపు జీవక్రియాత్మక ఆరోగ్యానికి ఆహార మార్పు తప్పనిసరి అంశంగా మారింది. క్యాలరీలు సరిపోతున్నాయనే భావనతో సంతృప్తి పడటం కాకుండా, ఆ క్యాలరీల నాణ్యతను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. అధిక కార్బోహైడ్రేట్ ఆధారిత ఆహారం మధుమేహం, ఊబకాయం వంటి సమస్యలను నెమ్మదిగా కానీ నిరంతరంగా పెంచుతోంది. ప్రోటీన్ లోపం శరీర తృప్తిని తగ్గించి, అనవసర ఆహార వినియోగానికి దారి తీస్తోంది. చక్కెర వినియోగం కనిపించని ప్రమాదంగా మారి ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తోంది. చిన్న పరిమాణ మార్పులు కూడా దీర్ఘకాలంలో పెద్ద ఆరోగ్య లాభాలను అందించగలవని గణాంకాలు సూచిస్తున్నాయి. ఆహార పళ్లెంలో సమతుల్యత తీసుకురావడం వ్యక్తిగత ఆరోగ్యానికి మాత్రమే కాదు, దేశ భవిష్యత్తుకు కూడా అవసరం. నేటి ఆహార నిర్ణయాలే రేపటి ఆరోగ్యభారతాన్ని నిర్మిస్తాయి. సమయోచిత ఆహార సంస్కరణ ద్వారానే జీవక్రియాత్మక వ్యాధుల భారాన్ని తగ్గించగలము.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
ఆర్ట్స్ కాలేజీ, కేయూ

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.